Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 37 పేజీలు 8 వెల : 5 బుధవారం 29 అక్టోబర్ 2025






## కాకినాడ వద్ద తీరం దాటిన మొంథా తుఫాన్

అర్ధరాత్రి వరకు తీవ్ర ప్రభావం

గంటకు 9నుంచి

110 కిమీ వేగంతో గాలులు

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

అమరావతి వాతావరణ శాఖ వెల్లడి

2లో..



# తుఫాన్ అనంతర చర్యలపై దృష్టి

**ప్రాణనష్టం జరక్కుండా చర్యలు చేపట్టాం**

**అన్ని రకాలుగా అండగా ఉండేలా సన్నద్ధం**

**మీడియా సమావేశంలో మంత్రులు లోకేశ్, అనిత**

అమరావతి: మొంథా తుపాన్ ప్రభావం 40 లక్షల మందిపై ఉందని మంత్రి లోకేశ్ అన్నారు. ఎక్కడా ప్రజల ప్రాణాలకు ముప్పు ఉండకూడదన్నదే ఈ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు లోకేశ్, అనితలు స్పష్టం చేశారు. ఈ తుపాన్ ప్రభావం ఉన్న 1,320 గ్రామాల ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించామన్నారు. 1906 షెల్టర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇప్పటికే తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించామని.. వాటిని షెల్టర్లుగా మార్చామని వివరించారు. ఈ విపత్తు సమయంలో 11 ఎన్డీఆర్ఎఫ్, 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మొంథా తుపాన్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యూఏఈకి వెళ్లక ముందు సమీక్ష నిర్వహించారని లోకేశ్, హోం మంత్రి అనిత తెలిపారు. ఈ తుపాన్ పై ఇప్పటి వరకు ఆయన 12 సార్లు సమీక్ష నిర్వహించారని వెల్లడించారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రులు లోకేశ్, అనిత విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ రాత్రి 11.30 గంటలకు ఈ తుపాన్ ల్యాండ్ ఫాల్ అవుతుందని తాము అంచనా వేస్తున్నట్లు చెప్పారు. తుపాన్ దిశను బట్టి సిబ్బందిని మోహరించామన్నారు. గతంలో పంచాయతీ రాజ్ మంత్రిగా ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు సీపీడబ్ల్యూ బృందాలను ఏర్పాటు చేసి జనరేటర్లు సిద్ధం చేశామని మంత్రి నారా లోకేశ్ గుర్తు చేశారు. అలాగే సెల్ టవర్ల వద్ద జనరేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మంగళవారం రాత్రి అంతా ఆర్టీజీఎస్‌లో ఉండి తుపానును మానిటరింగ్ చేస్తామన్నారు. ఇక ప్రతి రెండు గంటలకు ఒకసారి సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తారని తెలిపారు. తుపాన్ తీరం దాటిన అనంతరం సహాయ, పునరావాస చర్యలను సకాలంలో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. బీచ్‌లు, లోతట్టు ప్రాంతాలకు వెళ్ల వద్దని ప్రజలకు ఈ సందర్భంగా సూచించారు. తమకు సహకరించాలని ప్రజలకు మంత్రులు విజ్ఞప్తి చేశారు.



**పునరావాసం చర్యలకు ప్రత్యేక శ్రద్ధ**

**ఆస్తి, ప్రాణనష్టం జరక్కుండా చర్యలు**

# తుఫాన్ ప్రభావంపై చంద్రబాబు సమీక్ష

అమరావతి: మొంథా తుపాను ప్రభావంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రులు, పలు శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, అనిత, నారాయణ హాజరయ్యారు. తుపాను నేపథ్యంలో ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సహాయక చర్యలు, పునరావాసం, నష్టం అంచనా అంశాలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు సీఎం చంద్రబాబు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. డ్రోన్లతో ముంపు ప్రాంతాల్లో చర్యలు చేపట్టాలని సూచించారు. వాగులు పొంగే అవకాశం ఉన్నచోట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాల్వలు, చెరువులకు గండ్లుపడకుండా పర్యవేక్షణ ఉండా లని మార్గనిర్దేశర చేశారు. లంక గ్రామాల ప్రజలను రిలీఫ్ క్యాంపులకు త్వరితగతిన తరలించాలని సూచించారు సీఎం చంద్రబాబు. విద్యుత్ సరఫరాపై ఫోకస్ పెట్టి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆజ్ఞాపించారు. తుపాను తీరం దాటిన తర్వాత భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. పునరావాస శిబిరాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అధికారులు - ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. అయితే,
ఈరోజు
అర్ధరాత్రి వరకు సచివాలయంలోనే సీఎం చంద్రబాబుఉండనున్నారు. మొంథా తీవ్ర తుపాన్‌పై ఎప్పటికప్పుడు అధికారులతో చంద్రబాబు సమీక్షిస్తు న్నారు. రెవెన్యూ, ఐటీ, హోంమంత్రి, అధికారులతో ఎప్పటికప్పుడూ మొంథా తుపాను వివరాలు తెలుసుకుంటున్నారు సీఎం చంద్రబాబు.

# తీరాన్ని తాకిన 'మొంథా' తీవ్ర తుపాను

అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను తీరాన్ని తాకింది. కాకినాడ- మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తీరాన్ని తాకింది. పూర్తిగా తీరం దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. తీరం దాటే ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాల్లో భారీగా గాలులు వీస్తున్నాయి.బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ పత్తుల నిర్వహణ సంస్థ ఎండీ వి.ప్రఖర్ జైన్ తెలిపారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెట్టండి

కాంగ్రెస్, బిఆర్ఎస్‌లతో ఒరిగేదేమీ లేదు

అభివృద్ధి కావాలంటే బిజెపి అభ్యర్థిని గెలిపించాలి

ప్రచారంలో ఎంపి ఈటెల రాజేందర్ పిలుపు

పెన్షన్లు లేవు, ఇళ్లు లేవు, మురికి కాల్వలు సరిగా లేవు, తాగే నీరు సైతం సరిగ్గా రావడం లేదని బస్తీల ప్రజలు




2లో..

## సొంత జిల్లాకు అన్యాయం చేస్తున్న రేవంత్

పాలమూరు-రంగారెడ్డి పై నిర్లక్ష్యం

జిల్లా ప్రజలు రేవంత్‌ను క్షమించరు

ఉదండాపూర్ నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25 లక్షలు

జాగృతి జనంబాటలో కవిత డిమాండ్



2లో..

# ఏఐ టెక్నాలజీతో అప్రమత్తం

**డీప్‌ఫేక్ మోసాలతో జాగ్రత్త**

**సేఫ్‌వర్డ్ టెక్నిక్ సూచించిన సిపి సజ్జన్నార్**

హైదరాబాద్: ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్ ఇప్పుడు మన జీవితంలో కీలకంగా మారింది. ఈ టెక్నాలజీ ఎంత శక్తివంతమైందో, అంతే ప్రమాదకరంగా కూడా మారుతోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా మన ముఖం, మన గొంతును కూడా కచ్చితంగా నకిలీగా సృష్టించడం సాధ్యమైంది. ఇప్పుడు ఎవరికైనా మీ వీడియో లేదా వాయిస్‌ను వాడి, మీరు మాట్లాడుతున్నట్టుగా నకిలీ సందేశాలు పంపడం, వీడియోలు తయారు చేయడం లేదా కాల్స్ చేయడం సాధ్యమవుతోంది. దీంతో వ్యక్తిగత, ఆర్థిక మోసాలు విపరీతంగా పెరుగు తున్నాయి. తాజాగా పలు దేశాల్లోనే కాకుండా మన దేశంలో కూడా డీప్‌ఫేక్ ఆధారంగా మోసాలు జరుగుతున్నాయి. కొంతమంది మోస గాళ్లు మీ స్నేహితులు, బంధువులు, సహచరులు లేదా అధికారులుగా



నటిస్తూ డబ్బు లేదా వ్యక్తిగత సమాచారం తీసుకోవడానికి ప్రయత్ని స్తు న్నారు. ఇలాంటి మోసాలను గుర్తించడం చాలా కష్టంగా మారింది, ఎందుకంటే అవి నిజంగా ఉన్నట్లే కనిపిస్తాయి. ఇలాంటి మోసాల నుంచి రక్షణ పొందేందుకు ఒక సులభమైన కానీ అత్యంత ప్రభావవంతమైన పద్ధతి 'సేఫ్ వర్డ్'. అది మీరు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సహచరులతో మాత్రమే పంచుకునే ఒక ప్రత్యేక పదం లేదా సంకేతం. ఏదైనా అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వస్తే, ఆ వ్యక్తి నిజమా కాదా తెలుసుకోవడానికి ఆ 'సేఫ్ వర్డ్' అడగాల్సి ఉంటుంది.

# మావోయిస్టులకు భారీ దెబ్బ

**పలువురు అగ్రనేతల లొంగుబాటు**

**డిజిపి శిశధర్ ఎదుట లొంగిపోయిన నేతలు**

**పుల్లూరి ప్రసాద్ రావు, బండిప్రకాశ్‌లో లొంగుబాటు**

**లొంగిన వారిని పూర్తిస్థాయిలో ఆదుకుంటామన్న డిజిపి**

హైదరాబాద్:మావోయిస్టులకు మరో దెబ్బతగిలింది. పలువురు అగ్రనేతలు లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని తెలంగాణ ప్రభుత్వం పిలుపునిచ్చిన క్రమంలో రాష్ట్ర సర్కార్ పిలుపు మేరకు మావోయిస్టులు ఆజ్ఞాతం వీడారు. డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట మంగళవారం మావోయిస్టు అగ్రనేతలు లొంగిపోయారు. మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న , చంద్రన్నా, మావోయిస్టు స్టేట్ కమిటీ మెంబెర్



బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ లొంగిపోయారు. అయితే, పుల్లూరి ప్రసాద్ రావుపై రూ.25 లక్షలు రివార్డు ఉంది. బండి ప్రకాష్ అలియాస్ ప్రభాతలపై రూ.20 లక్షలు రివార్డు ఉంది. అయితే, అజ్ఞాతంలో 64 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. ఇప్పటి వరకు 427మంది లొంగిపోయారు. అందులో 8 మంది స్టేట్ కమిటీ, 2 సెంట్రల్ కమిటీ మెంబెర్లు లొంగిపోయారు. 9 మంది మాత్రమే తెలంగాణలో, మిగిలిన వారు వేరే రాష్టాల్లో ఉన్నారు. సెంట్రల్ కమిటీలో 5 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. 10 మంది స్టేట్ కమిటీ మొంబర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 20 మంది డిస్ట్రిక్ కమిటీ, 14 మంది ఏరియా కమిటీల్లో, 10 మంది తెలంగాణ కమిటీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్‌తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. మావోయిస్టుల లొంగుబాటు వివరాలను డీజీపీ మీడియా సమావేశంలో వెల్లడించారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్‌వార్‌లో చేరి.. 1983లో కమాండర్ అయ్యారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు.

# కాకినాడ వద్ద తీరం దాటిన మొంథా తుఫాన్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు సమీపంలో మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని అమరావతి ఐఎండీ ప్రకటించింది. పూర్తిగా తీరాన్ని దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటలు సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొంది. తీరాన్ని దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని స్పష్టం చేసింది. కాకినాడ-మచిలీపట్నం మధ్య మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. గడిచిన 6 గంటల్లో గంటకు 17 కి.మీ వేగంతో తుపాన్ కదిలిందని పేర్కొన్నారు. ప్రస్తుతానికి మచిలీపట్నానికి 120 కిమీ, కాకినాడకి 110 కిమీ, విశాఖపట్నానికి 220 కిమీ దూరంలో కేంద్రీకృతమైందని తెలిపారు. పూర్తిగా తీరం దాటడానికి 3-4 గంటల సమయం పడుతోందన్నారు. దీని ప్రభావంతో కోస్తా వెంబడి గంటకు 90-100 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వివరించారు. ప్రజలు సురక్షితంగా ఇంట్లోనే ఉండాలన్నారు. కృష్ణా జిల్లాలోని గుడివాడలో తుఫాను ప్రభావంతో భారీ గాలులతో పలుచోట్ల ప్రధాన రహదారుల్లో చెట్లు నేలకూలాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, గుడివాడ ముదినేపల్లి ప్రధాన రహదారిలో వృక్షాలు నేల కూలాయి. గుడివాడ - విజయవాడ ప్రధాన రహదారిలో వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. హుటాహుటిన విపత్తు స్పందన / అగ్నిమాపక శాఖ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. చిమ్మ చీకటిలో ఆధునిక యంత్ర సామాగ్రితో రోడ్లపై కూలిన చెట్లను బృందాలు తొలగిస్తున్నాయి. ముదినేపల్లి ప్రధాన రహదారిలో కూలిన వృక్షాలను గుడివాడ రూరల్ పోలీసులు తొలగించారు. ప్రకాశం జిల్లాలో తుపాను ప్రభావంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు పడుతున్నాయి. ఈదురు గాలులతో ఒంగోలుతో పాటు తీర ప్రాంత గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద రామన్న చెరువుకి గండి పడింది. ఒంగోలు - చీరాల రహదారిపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు క్లియర్ చేస్తున్నారు. వర్షాల ధాటికి సంతనూతలపాడు చెరువు నిండి అలుగు పారుతుంది. ఒంగోలు - చీమకుర్తి రహదారిపై వరద నీరు భారీగా ప్రవహిస్తోంది. ముందస్తు చర్యల్లో భాగంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చెట్లు పడి, విద్యుత్ తీగలు తెగి, స్తంభాలు కూలిన ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పరిస్థితిని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. నిపిపివేసిన ప్రాంతాల్లో త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరించేలా మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సమస్య తలెత్తిన ప్రాంతాల్లో సిబ్బంది వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నంలో మొంథా తుఫాన్ బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలుల కారణంగా భారీ చెట్లు, స్తంభాలు విరిగిపడ్డాయి. కుండపోత వర్షం కురవడంతో వైజాగ్ లోని సింధియా రోడ్డు నీట మునిగింది. కొన్ని చోట్ల రోడ్డుకి అడ్డంగా పడిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఒక ప్రాంతంలో కారుపై భారీ వృక్షం పడటంతో వాహనం ధ్వంసమైంది. కొన్ని ప్రదేశాల్లో భారీ ట్రాఫిక్ జామ్ అయింది. అధికారులు చెట్లను తొలగిన్నారు. భారీ వర్షాల కారణంగా విజయవాడ దుర్గగుడ ఘాట్ రోడ్డుని అధికారులు మూసివేశారు. కనకదుర్గ నగర్, లిఫ్ట్ మార్గం ద్వారా అమ్మవారిని దర్శించుకోవాలంటూ భక్తులకు అధికారులు సూచించారు.

## ఎన్‌డిఎ, ఇండియా కూటముల మోసపూరిత రాజకీయం

పాట్నా: బిహార్ జనాభాలో 17 శాతం మైనారిటీలు ఉన్నప్పటికీ ముస్లిం ముఖ్యమంత్రి ఎందుకు లేరని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ఇటు ఎన్డీయే, అటు 'ఇండియా' కూటమి ముస్లింలను మోసగిస్తున్నాయని విమర్శించారు. గోపాల్ గంజ్ నుంచి బిహార్ ఎన్నికల ప్రచారానికి ఒవైసీ మంగళవారంనాడు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 32 నియోజకవర్గాల్లో ఎంఐఎం పోటీ చేస్తోంది. 'రాష్ట్ర జనాభాలో 17 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముస్లింలు ఎందుకు సీఎం కాకూడదు? జనాభాలో 3 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తామని హామీ ఇస్తే దానితోనే సరిపుచ్చుకోవాలని అనుకుంటున్నారు' అని ఒవైసీ అన్నారు. ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా నిషాద్ నేత ముఖేష్ సహానిని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఇటీవల ప్రకటించారు. సమాజంలోని ఇతర వర్గాలతో పాటు ముస్లింలకు కూడా ఉప ముఖ్యమంత్రి పదవి కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీపై మైనారిటీల్లో ఉన్న భయాన్ని ఆసరాగా తీసుకుని కాంగ్రెస్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలు ముస్లిం ఓట్లకు గాలం వేస్తున్నాయని, అయితే ఈ పార్టీలు బీజేపీని అడ్డుకోలేవని ఒవైసీ అన్నారు. టికెట్ల పంపిణీలో జనాభా ప్రాతిపదికన టిక్కెట్లు ఇవ్వలేని అవకాశవాద పార్టీల మాయలో పడవద్దని అన్నారు. ముస్లిం కమ్యూనిటీ సొంతంగా నాయకత్వాన్ని పటిష్టం చేసుకోవాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీపైనా ఒవైసీ విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నివర్గాల ప్రగతి కోసం పాటుపడుతున్నామని చెబుతుంటారని, కానీ ఆయన పార్టీ ఒక్క ముస్లింకు కూడా ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదని ఆక్షేపణ తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సైతం పదపదే చొరబాటుదారుల ప్రస్తావన చేస్తూ మైనారిటీలను విమర్శిస్తుంటారని, ఇంతపెద్ద ఎస్ఐఆర్ చేపట్టి ఎంతమంది చొరబాటుదారులను నిలువరించారో చెప్పాలని అన్నారు. అమిత్‌షా మంత్రిత్వ శాఖ పరిధిలోని బీఎస్ఎఫ్ దేశ సరిహద్దులో మోహరించి ఉండగా చొరబాట్లు ఎలా కొనసాగుతున్నాయో చెప్పాలన్నారు. ఈ అంశాలపై అసెంబ్లీలో బిహార్ ముస్లింలు నిలదీయాలను కుంటే ఎఐఎంఐఎం పతంగి గుర్తుకు ఓటేయాలని కోరారు. మోదీ మనసు అహ్మదాబాద్‌పై, నితీష్ మనసు రాజ్‌గిర్‌పై, లాలూ మనసు ఆయన కొడుకుపైనా ఉంటుందని, సామాన్య ప్రజానీకం గురంచి వారికి ఆలోచనే లేదని ఒవైసీ విమర్శించారు.

## విపక్షాలవి బూటకపు హామీలు

పాట్నా: ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి పేరుతో విపక్షాలు బూటకపు వాగ్దానాలు చేస్తూ ప్రజలను తప్పదారి పట్టిస్తున్నాయని బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అన్నారు. ఇంటింటికీ ఒక ప్రభుత్వ ఉద్యోగమంటూ విపక్ష 'మహాగట్‌బంధన్' మంగళవారం నాడు విడుదల చేసిన మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో విపక్షాల తప్పుడు వాగ్దానాలు చేస్తున్నాయంటూ నితీష్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో విమర్శించారు. 'మహాకూటమి ప్రభుత్వం 15 ఏళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉంది. అప్పుడు యువతకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదు. రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టారు. విపక్షాల చెబుతున్న మాయమాటల భ్రమలో పడవద్దని ప్రజలను కోరుతున్నారు. మా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గుర్తుంచుకోండి. ఇకముందు కూడా అభివృద్ధిని కొనసాగిస్తాం. చేసిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తాం' అని నితీష్ పేర్కొన్నారు. బిహార్‌లో 2005కు ముందు నిరక్షరాస్యత, నిరుద్యోగత, వలసలు ఉండేవని.. ఉన్నత విద్య కోసం ఒక్క మంచి విద్యాసంస్థ కూడా ఉండేది కాదని, యువత చీకట్లో మగ్గేదని నితీష్ గుర్తుచేశారు. యువకులు ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లి అక్కడ అవమానాలు పాలయ్యేవారని చెప్పారు. ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేసేవారు కాదని, ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉండేదని అన్నారు. పనిచేసే వాతావరణం కానీ, సౌకర్యాలు కానీ, నెలవారీ జీతాలు, పింఛన్లు వచ్చేవి కావని తెలిపారు. జీతాల కోసం ఆరు నెలలపాటు ఎదురు చూపులు, వేతనాలు, పెన్షన్ల కోసం నిరసనలు చోటుచేసుకునేవని అన్నారు. ఇప్పుడు అదే వ్యక్తులు అధికారం కోసం తప్పుడు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం 2005 నుంచి 2020 వరకూ 8 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు.

# జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెట్టండి

హైదరాబాద్: జూబ్లీహిల్స్ అంటే హైదరాబాద్‌లో రిచెస్ట్ ప్లేస్ కానీ ఈ నియోజకవర్గం లోని బస్తీల ప్రజల బాధలు మాత్రం వర్ణనాతీతమని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా మంగళవారం ఆయన నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెడితేనే చలనం వస్తుందని ప్రజలకు సూచించారు. పెన్షన్లు రావాలన్నా, డబుల్ బెడ్ రూం ఇళ్లు రావాలన్నా, మురికి కాలువలు కట్టాలన్నా, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే వారి మెడలు వంచి బీజేపీ కొట్లాడుతుందని ఎంపీ ఈటల స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి ఓటు వేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీపక్ రెడ్డి ఇప్పటికే ఇక్కడ పోటీ చేసి ఉన్నారని గుర్తు చేశారు. ఆ క్రమంలో ఆయన అందరికి సుపరిచితుడన్నారు. తాను మూడవ రోజు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నానన్నారు. అయితే పేరుకే జూబ్లీహిల్స్.. పారే మురికి కాలువలు, కంపు వాసనలు, గతుకుల రోడ్లు ఏ పేదవాడిని కదిలించినా మమ్మల్ని పట్టించుకునే వారే లేరని ఆవేదన చెందుతున్నారని తెలిపారు. భర్త చనిపోయి ఐదేళ్లు అయినా.. 65 ఏళ్ళు




దాటినా తమకు పెన్షన్ రావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో టిఆర్ఎస్ పార్టీ ఇస్తామంటూ మోసం చేసిందని.. ఇవన్నీ ఇస్తారని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఆ పార్టీ సైతం తమను మోసం చేసిందని ప్రజలు మండిపడుతున్నారని చెప్పారు. పెన్షన్లు లేవు, ఇళ్లు లేవు, మురికి కాల్వలు సరిగా లేవు, తాగే నీరు సైతం సరిగ్గా రావడం లేదని బస్తీల ప్రజలు చెబుతున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టామని.. కాంగ్రెస్ పార్టీకి సైతం అదే గతి పడుతుందని వారు అంటున్నారని చెప్పారు. 40 ఏళ్ల క్రితం ఎలా ఉందో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అలాగే ఉందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. మంత్రుల మధ్య సమన్వయం లేదని చెప్పారు. మంత్రులకు డబ్బులు సంపాదించుకోవడానికి, దోచుకోవడానికే సమయం సరిపోతుంది తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రజల సమస్యలపై అసెంబ్లీ వేదికగా కొట్లాడుతున్నది బీజేపీ మాత్రమేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఇది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఆ క్రమంలో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. తమ పార్టీ కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, లీడర్లు ఇలా ప్రతి ఇంటికి వెళ్ళి ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు.

# సొంత జిల్లాకు అన్యాయం చేస్తున్న రేవంత్

మహబూబ్‌నగర్: సొంత జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన కరివెన రిజర్వాయర్‌ను సందర్శించి కవిత మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చారిత్రక అన్యాయం చేస్తున్నారని.. జిల్లా ప్రజలు ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీని క్షమించరని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను సుప్రీంకోర్టు సస్పెన్షన్‌లో పెట్టినా.. రివ్యూ పిటిషన్ వేయకపోవటం దారుణమని మండిపడ్డారు. సీడబ్ల్యూసీ ప్రాజెక్టుల పర్మిషన్ ఆపేసి లిస్ట్ లోంచి తీసేసినా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవటం లేదన్నారు. వెంటనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహబూబ్ నగర్ జిల్లాకు వచ్చిన కవిత ప్రజలతో మాట్లాడారు. మహబూబ్ నగర్ జిల్లాకు నీరిచ్చే వరప్రదాయని కృష్ణానది అని కొనియాడారు. తెలంగాణ సిద్దించిన తర్వాత అలాంటి కృష్ణానదిపై పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ డిజైన్ చేసుకోవటం జరిగిందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 80 శాతం పూర్తి అయ్యాయని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా సరే ప్రాజెక్ట్ ఒక్క అడుగూ ముందుకుపడలేదని విమర్శించారు. ఉదండాపూర్, కరివెనలో ఒక తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్లపూర్- ఏదుల టన్నెల్ పనులను చేయటం లేదన్నారు. ఒక పక్క ఉన్న నీళ్లను వాడుకోవటం లేదని.. మరో పక్క ఆల్మట్టి ఎత్తు పెంచితే మాట్లాడటం లేదని దుయ్యబట్టారు. తక్షణమే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఉదండాపూర్ నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25 లక్షలు ఇవ్వాలనికవిత డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉదండాపూర్ నిర్వాసిత రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. భూ నిర్వాసితులకు ఏ రోజు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందో ఆనాటి రేటు కట్టి ఇవ్వాలని చెప్పారు. 2021 నాటికే కటాఫ్



పెట్టటం సరికాదని.. పరిహారం ఇచ్చే నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఇవ్వాల్సిందేనని అన్నారు. తప్పు బీఆర్ఎస్ చేసిందా? కాంగ్రెస్ చేసిందా? అని కాదని.. ఇక్కడ ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి జరగాలని మాత్రమే తాను ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని.. మిగతా పనులు ఈ ప్రభుత్వం చేస్తుందా? లేదా? చెప్పాలని ప్రశ్నించారు. జనంబాటలో భాగంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులతో మాట్లాడారు. తెలంగాణ రాకముందు మహబూబ్ నగర్ లో నీళ్ల కరువు ఎలా ఉండేదో అందరికీ తెలుసని చెప్పారు. వందల ఎకరాలు ఉన్న వారు కూడా నీళ్లు లేక వలస పోయారని ఆనాటి రోజులను గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారానీటి సమస్యలను అధిగమించామని చెప్పారు. కృష్ణా నది నీళ్లను వినియోగించుకోవాలని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కేసీఆర్ చేపట్టారని తెలిపారు. ఉదండాపూర్ రిజర్వాయర్ సహా అన్ని పనులు 80 శాతం వరకు అప్పుడే పూర్తయ్యాయని అన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. రేవంత్ రెడ్డి గెలిచి కూడా రెండేళ్లు అయ్యిందని చెప్పారు. ఇప్పటి వరకు ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ కోసం భూములు ఇవ్వటానికి ఇక్కడి ప్రజలు పెద్ద మనసు చేసుకొని ఒప్పుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# రెండుచోట్ల ఓటరు గుర్తింపు

పాట్నా:బీహార్ ఎన్నికల వేళ ఈసీ నకిలీ ఓటర్లపై చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్‌కు ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. శ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో ఆయనకు రెండు ఓటరు ఐడీలు ఉన్నట్లు గుర్తించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. ఈ విషయంపై మూడు రోజుల్లో స్పందనను తెలియజేయాలని పీకేకు సూచించింది. త్వరలో జరగనున్న బిహార్ ఎన్నికల్లో పీకే పార్టీ పోటీచేయనున్న నేపథ్యంలో ఈసీ చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికల అధికారులు వెల్లడించిన అధికారిక రికార్డుల ప్రకారం..ప్రశాంత్ కిశోర్‌కు పశ్చిమ బెంగాల్‌ని కాళీఘాట్ రోడ్‌లో ఓటరు ఐడీ ఉంది. ఇది తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం చిరునామా. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇక్కడి నుంచే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోటీ చేశారు. అప్పట్లో పీకే టీఎంసీ పార్టీకి రాజకీయ సలహాదారుగా పనిచేశారు. బిహార్‌లోని తన స్వస్థలం కార్గహర్ నియోజకవర్గంలోనూ పీకే ఓటరుగా నమోదయ్యి ఉన్నారు. ప్రశాంత్ కిశోర్‌కు ఈసీ నోటీసులపై జన్ సురాజ్ పార్టీ ప్రతినిధి కుమార్ సౌరభ్ సింగ్ స్పందిస్తూ..ఇది ఎన్నికల సంఘం తప్పిదమేనని అన్నారు. ఓటరు కార్డుల జారీ విషయంలో సక్రమంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఈసీకి ఉందని పేర్కొన్నారు. ప్రశాంత్ కిశోర్ వంటి ప్రముఖుల విషయంలో తప్పులు చేసిన ఎన్నికల సంఘం ఇక సామాన్యుల విషయాల్లో ఎలా వ్యవహరిస్తుందో అన్నది తెలిసిన విషయమేనన్నారు.

# విద్యా రంగంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ



ఖమ్మం:రాష్ట్ర విద్యా వ్యవస్థను గేమ్ చేంజర్‌గా మార్చే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో విద్యా రంగంపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. విద్యా రంగంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలవాలన్న దృష్టితో సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. ఆ దిశగా ఆర్థికశాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు.గ్రామీణ యువత పోటీ పరీక్షల కోసం దూరప్రాంతాలకు వెళ్లి ఖర్చులు పెట్టాల్సిన అవసరం లేకుండా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. డిజిటల్ లైబ్రరీ, నిష్ణాతులైన అధ్యాపకులచే ఆన్‌లైన్ కోచింగ్, పోటీ పరీక్షలకు అవసరమైన మొత్తం స్టడీ మెటీరియల్ ఈ సెంటర్లలో అందుబాటు లోకి తీసుకొస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో ఐదు ప్రదేశాల్లో ఇవి ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేశామని చెప్పారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అందించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని భట్టి ప్రకటించారు. మారుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా, పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రతి మండలంలో మూడు ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతులు, బోధనా సౌకర్యాలు పెంచుతున్నామని స్పష్టం చేశారు. ప్రతి పది గ్రామాలకు ఒక పాఠశాలను గుర్తించి అప్‌గ్రేడ్ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఇంటర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్థానిక సీఎస్ఆర్ నిధుల ద్వారా అందించే విధంగా సూచనలు ఇచ్చామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల పైన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి విద్యుత్‌లో స్వయం సమృద్ధిని సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

# హరీష్ రావుకు పితృవియోగం



హైదరాబాద్: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది. హరీశ్ తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివ దేహాన్ని ఉంచారు. హరీశ్‌రావుకు పితృవియోగంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్ నగర్ మహాప్రస్థానంలో నిర్వహించారు. తన్నీరు సత్యనారాయణ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. తన బావతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకుని, ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సమాచారం తెలిసిన వెంటనే హరీశ్ రావును ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోకాపేటలోని హరీశ్ రావు నివాసానికి వెళ్లి, దివంగత సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. తన సోదరిని, కుటుంబ సభ్యులను ఓదార్చనున్నారు. భర్తను కోల్పోయిన అక్క లక్ష్మమ్మకు కేసీఆర్ ధైర్యం చెప్పారు. ఇక హరీశ్‌రావును గుండెలకు హత్తుకుని కేసీఆర్ ఓదార్చారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తన్నీరు సత్యనారాయణ రావు కన్నుమూశారు. ఆయన పార్థివ దేహానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఉన్న ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. హరీశ్ రావును, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీమణి శోభ.. హరీశ్ రావును ఓదార్చారు. సత్యనారాయణ రావు భౌతికకాయానికి నివాళు లర్పించారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బిగాల గణెశిశ్ గుప్తా, మెతుకు ఆనంద్, హరీశ్ రావును పరామర్శిం చారు. సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు నివాళి అర్పించారు. అలాగే సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. కటుఉంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఎపి మాజీ సిఎం జగన్ తదితరులు కూడా సంతాపం ప్రకటించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి పట్ల ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విచారం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు తండ్రి మృతి పట్ల ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిన ప్రార్థించారు. ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి సానుభూతి తెలియజేశారు.



# సినీ కార్మికులకు ప్రభుత్వం అండ



20 శాతం వాటా తప్పనిసరి ఇవ్వాల్సిందేనని అన్నారు.. ఆ వాటా వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ అవ్వాలి. లేదంటే టికెట్ ధరల పెంపుకు జీఓ ఇవ్వం అని స్పష్టం చేశారు. నిర్మాతలు, కార్మికులు కుటుంబ సభ్యుల్లా ఉండాలని సూచించారు. ఫైటర్స్, టెక్నీషియన్ల నైపుణ్యం పెంచేందుకు ఫ్యూచర్ సిటీలో భూమి కేటాయిస్తామని తెలిపారు. మీకు అవసరం ఉన్నప్పుడు మీకు అందుబాటులో ఉంటా. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెన్నంటి ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.సినీ కార్మికుల శ్రమ నాకు బాగా తెలుసు. మీ కష్టాలు తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకోలేదని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారు. ఒకప్పుడు సినీ పరిశ్రమ అంటే మద్రాసే అనుకునే వారు. కానీ, నేడు తెలుగు సినిమా ఆస్కార్ అవార్డుల వరకు వెళ్లగలిగింది. ఈ గౌరవం తెర వెనుక కష్టపడే కార్మికుల శ్రమ ఫలితమే అని రేవంత్ అభినందించారు. నిలిచిపోయిన నంది అవార్డులను ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుతో అవార్డులను ఇస్తున్నామని సీఎం తెలిపారు. హాలీవుడ్ కూడా తెలంగాణకు వచ్చి షూటింగ్ చేసుకునేలా మారాలి. చిన్న సినిమాలను తక్కువ చేసి చూసే ప్రసక్తే లేదు. ఐటీ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, సినిమా పరిశ్రమకూ అంతే ప్రాధాన్యత ఇస్తాం అని ఆయన అన్నారు. ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా. హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్‌లో షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. ప్రభుత్వం చేయగలిగిన పనులు చేస్తాం. సినిమా టికెట్ల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం అని సీఎం తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు చెప్పిన సీఎం రేవంత్. 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. హైదరాబాద్ కు సినీ పరిశ్రమ రావడంలో మర్రిచెన్నారెడ్డి పాత్ర కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎంతో మందిని సంప్రదించి పరిశ్రమను తెచ్చారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికులను ఆదుకున్నారని.. కార్మికుల కోసం పది ఎకరాలు ఇచ్చారని తెలిపారు. పరిశ్రమను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు సీఎం. సినీ కార్మికులకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు , పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక



# విద్యారంగ సమస్యలు పరిష్కారానికై ఇచ్చాపురం నుండి హిందూపురం వరకు జరుగుతున్న బస్సు జాత జయప్రదం చేయండి.

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు అక్టోబర్ 28 మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 6,400 కోట్ల బకాయిలు విడుదల చేయాలి.ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటీకరణ విధానాన్ని విరమించుకోవాలి.ప్రభుత్వ పాఠశాల విద్యను కాపాడాలి మూసివేయబడ్డ పాఠశాలలను పునఃప్రారంభించాలి.ఎన్నికలలో ఇచ్చినటువంటి హామీలలో భాగంగా జీవో నెంబర్ 107,108,77 జీవోలను రద్దు చేయాలిప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ లలో మౌలిక వసతులు కల్పించాలి.రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న బోధనా బోధనేతర పోస్టులు భర్తీ చేయాలి.ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. షాబీర్ భాషఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో జూనియర్ కళాశాల నందు గోడ పత్రికలు విడుదలఎమ్మిగనూరు పట్టణం రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకు అక్టోబర్ 22 వ తేది నుంచి నవంబర్ 12 వ తేది వరకు జరుగుతున్న బస్సు జాత జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్ భాష పిలుపునిచ్చారు.అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు బస్సు జాతా గోడ పత్రికలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్ భాష, మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకు జరుగుతున్న బస్సు జాతకు విద్యార్థి లోకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పిపిపి విధానాన్ని ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఆదోని లో ఉన్న మెడికల్ కళాశాలను పిపిపి లో భాగంగా ప్రైవేటీకరణ చేయడానికి తక్షణమే నిర్మించుకోవాలని డిమాండ్ చేశారు. డిగ్రీ, ఇంజనీరింగ్ పీజీ, చదువుకున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్లు విడుదల చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యను కాపాడాలి గత ప్రభుత్వం లో మూసి వేయబడ్డ పాఠశాలలను పున ప్రారంభించాలని తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీ అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుకున్న దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దు చేయాలన్నారు.. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న 3420 ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ హాస్టల్ లో మౌలిక వసతులు కల్పించి పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ చార్జీలు కాస్మోద్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో జూనియర్ కళాశాల నియోజకవర్గం లో డిగ్రీ, పాలిటెక్నిక్ మరియు ఐటిఐ కళాశాలల ను ఏర్పాటు చేయాలన్నారు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బస్సు జాతాలో భాగంగా నవంబర్ 12 తేదీన అనంతపురంలో ముగింపు సభకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి ఖాదర్, సహాయ కార్యదర్శి సమీర్, దస్తగిరి, నాయకులు హాజీ, వీరేష్, హనీఫ్,మణికంఠ, శైక్షవలి తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 30న జరగబోయే "డిఈఎఫ్ తాలుకా నూతన కార్యవర్గ ఎన్నిక మీటింగ్" జయప్రదం చేయండి.

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు అక్టోబర్ 28 మంగళవారం – రాష్ట్ర డిఈఎఫ్ అధ్యక్షులు బి సి నాగరాజు. మంగళవారం జిల్లా "దివ్యాంగుల సాధికారత ఫోరం" (డిఈఎఫ్) కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు బి సి నాగరాజు పత్రికా ముఖంగా మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ గురువారం ఎమ్మిగనూరు తాలుకాకు సంబంధించిన పట్టణ మరియు మండలాల స్థాయి దివ్యాంగుల పలు అంశాలపై చర్చిస్తు అలాగే డిఈఎఫ్ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక మీటింగ్ జరుగుతుందని కావున ఈ కార్యక్రమానికి దివ్యాంగ సోదర, సోదరీమణులందరూ తప్పకుండా రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ బి వి జయా నాగేశ్వరరావు రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేసిన నెహ్రు నగర్ కాలనీ ప్రజలు...

**పందికోన ఈరన్న తెలుగుదేశం పార్టీ నాయకులు**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు అక్టోబర్ 28 మంగళవారం నెహ్రు నగర్ లో మొన్నటి రోజున వరకు కరెంటు స్తంభాలకు పక్కన ఉన్న చెట్లు కొమ్మలు ఉండటం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నటువంటి నేపథ్యంలో కరెంటు తీగలు ప్రక్కన ఉన్నటువంటి చెట్ల కొమ్మలను తొలగించడం జరిగింది. దీంతోపాటు రోడ్డులు డ్రైనేజీలు క్రమం తప్పకుండా పరిశుద్ధ పనులు చేపిస్తున్నందుకు నెహ్రూ కాలనీ ప్రజలందరూ కూడా ఎమ్మిగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బి.విజయ నాగేశ్వర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# జిల్లాలో నేడు రేపు విపరీతమైన గాలులతో కూడిన భారీ నుండి అతి భారీగా వర్షాలు కురిసే అవకాశం

**కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను జిల్లా స్పెషల్ ఆఫీసర్ అరుణ్ బాబు ఐఏఎస్ తో కలిసి తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**కంట్రోల్ రూమ్ లోని అధికారులు జిల్లాలోని వారి శాఖలకు చెందిన అధికారులను అప్రమత్తం చేస్తూ పరిస్థితులను అధిగమించాలి**

**ప్రజలు ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు గమనించినా తిరుపతి కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్: 0877-2236007 ను సంప్రదించాలి**

**: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

**జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం జరగరాదు**

**తీర ప్రాంతాలలోని ప్రజలు, మత్స్య కారులు అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలి**

**జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్రీ అరుణ్ బాబు, IAS**





**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,అక్టోబర్ 28:**

"మొంథా" తుఫాను ప్రభావంతో జిల్లాలో నేడు రేపు విపరీతమైన గాలులతో కూడిన భారీ నుండి అతి భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఉదయం తిరుపతికలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ ను జిల్లా స్పెషల్ ఆఫీసర్ అరుణ్ బాబు ఐఏఎస్ తో కలిసి తనిఖీ చేసారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్, విద్యుత్, ఆర్ అండ్ బి ,పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్టీసీ, మెడికల్ పోలీస్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులతో తుఫాను సందర్భంగా తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "మొంథా" తుఫానును తేలికగా తీసుకోరాదని, జిల్లాలో వర్షాల తీవ్రత దృష్ట్యా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మరియు జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్రీ అరుణ్ బాబు, IAS సూచించారు. గత కొన్ని రోజులుగా వాతావరణ పరిస్థితులను నిరంతరంగా పర్యవేక్షిస్తున్నామని. ఈ రోజు రాత్రి నుండి రేపు మధ్యాహ్నం వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రతి శాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు ఆదేశించారు. తీరప్రాంతంలోని ఐదు మండలాలు, అలాగే చిట్టమూరు, ఓజిలి,దొరవారి సత్రం, పెళ్లకూరు సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లోని చెరువులు, రోడ్లు, కాజ్‌వేలు, లో లైన్ ప్రాంతాలను నిరంతరం పరిశీలించాలని, వరద నీటితో మునిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకొని అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఎవరూ అనవసరంగా బయటకు రావద్దని, చెరువులు, ట్యాంక్ బండ్లు వంటి ప్రమాదకర ప్రాంతాల్లో గస్తీ బృందాలను ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అటువంటి భవనాల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు.ప్రతి శాఖ తన పరిధిలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి, పరస్పర సమన్వయంతో పని చేయాలని, ప్రోటోకాల్ ను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సూచించారు.ఈ సందర్భంగా జిల్లా స్పెషల్ ఆఫీసర్ అరుణ్ బాబు ఐ ఏ ఎస్ మాట్లాడుతూ జిల్లాలో ఈ రోజు రేపు భారీ నుండి అతి భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, విపరీతమైన గాలులు కూడా మొదలయ్యాయని అందువల్ల ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. అర్బన్ పరిధిలో ముంపుకు గురయ్యే ప్రాంతాలని ముందుగా గుర్తించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి సంబంధిత అధికారులు వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. రూరల్ పరిధిలోని చెరువులను తరచూ పర్యవేక్షిస్తూ వాటి సామర్థ్యం గమనించుకొని గండి పడకుండా, రోడ్ కనెక్టివిటీ అంతరాయం కలగకుండా చూసుకోవలన్నారు. రెవెన్యు, పోలీసు సిబ్బంది తరచూ పర్యవేక్షిస్తూ మొరవప్రాంతాలలో ఎవరు దాటకుండా చూసుకోవాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ ప్రాణనష్టం జరగకూడదని, ఆస్తి నష్టం ఎక్కువ మేరకు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్య శాఖ వారు గర్భవతులు, బాలింతలను గుర్తించి వారి ఇంటివద్దనే వైద్య చికిత్స అందించాలని, డెలివరీ కి దగ్గరలో ఉన్న వారిని ఆసుపత్రుల్లో చేర్పించాలని తెలిపారు. తీరప్రాంతాలోని మత్స్యకారులకు చేపల వేటకు నిషేదమని, వారికి హెచ్చరికలు జారీ చేయాలని మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. కంట్రోల్ రూమ్ లో ఉన్న అధికారులు నిరంతరం 24/7 అందుబాటులో ఉండాలని, కంట్రోల్ రూమ్ కు వచ్చిన ప్రతి కాల్ కు జవాబు చేయాలని, కంప్లైంట్స్ పై ఏమి యాక్షన్ తీసుకున్నారో రిజిస్టర్ నందు తప్పనిసరిగా నమోదు చేయాలని, ముఖ్యమైన, అత్యవసర పరిస్థితులు వచ్చినపుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా నందు ఎలాంటి ఘటలను జరగకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# పట్టణంలోని 10వ వార్డులో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిది**



ఎమ్మిగనూరు అక్టోబర్ 28 మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక గారి మరియు పార్టీ సీనియర్ నాయకులు శ్రీ బుట్ట శివ నీలకంఠ గారి ఆదేశాల మేరకు 10వ వార్డ్ కౌన్సిలర్ సుధాకర్ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ విభాగ అధ్యక్షులు యూసుఫ్ ప్రజాకోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పిపిపి విధానంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలనే యత్నాలు చేస్తోందనే అంశంపై ప్రజల్లో చైతన్యం కలిగించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ క్రమంలో స్థానిక నాయకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 10వ వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించి, పిపిపి విధానంలోని దుష్పరిణామాలను ప్రజలకు వివరించారు.ప్రభుత్వ వైద్య విద్యను ప్రైవేట్ చేతుల్లోకి ఇచ్చే ప్రక్రియ వల్ల సాధారణ ప్రజలకు వైద్య విద్య అందుబాటులో ఉండదని, పేద కుటుంబాల భవిష్యత్తు దెబ్బతింటుందని వారు వివరించారు. ప్రజలు ఈ వివరణను ఆసక్తిగా విని, తమ మద్దతును తెలియజేస్తూ సంతకాలు చేశారు.ఈ సందర్భంగా వైయస్ఆర్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజల భవిష్యత్తును కాపాడే దిశగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా ప్రయోజనాల కోసం పోరాడుతుందని, పిపిపి విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తామని స్పష్టంచేశారు. ప్రజలందరూ ఈ పోరాటంలో భాగస్వాములుగా మారాలని వారు పిలుపునిచ్చారు.

# దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను విజయవంతం చేద్దాం : ఎమ్మార్పీఎస్ పిలుపు

**జస్టిస్ గవాయ్ పై దాడికి నిరసనగా ఛలో హైదరాబాద్ ..**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు అక్టోబర్ 28 మంగళవారం నవంబర్ ఒకటిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మిగనూరు , నందవరం మండలాల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఎం సీ గిడ్డయ్య మాదిగ , పూలచింత పెద్దయ్య మాదిగ , మంత్రాలయం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ కో ఇన్చార్జ్ ముగతి ప్రతాప్ కుమార్ మాదిగ , తెలుగుదేశం పార్టీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పందికోన ఈరన్న పిలుపునిచ్చారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల ఆరవ తారీఖున సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ ఆర్ గవాయ్ పై దాడి చేసిన రెండు వారాలు పూర్తయినా నిందితుడిపై ఎటువంటి కేసు నమోదు చేసి అరెస్టు చేయకుండా చేస్తున్న జ్యాప్యానికి నిరసనగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఛలో హైదరాబాద్ కార్యక్రమం లో భాగంగా లక్షల మంది దళితులతో జరగబోయే లిదళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శన కు ఎమ్మిగనూరు , నందవరం మండలాల నుండి దళితులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు . ఈ కార్యక్రమంలో కడిమెట్ల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఎస్ ప్రభుదాస్ మాదిగ , పూలచింత ఈరన్న మాదిగ , వివిధ గ్రామ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు .

# ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని మనవి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు అక్టోబర్ 28 మంగళవారం నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల వరకు హెచ్చరికలు జారీ చేయడమైనది మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ముఖ్యంగా భారీ వర్షాలతో ప్రజలకు తేల్చడమేగా ప్రజలు లోతట్ట ప్రాంతాలు కు ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వేలపల ఉన్న వెల్లి మీ కుటుంబాలకు ఎటువంటి జరగకుండా చూసుకోవాలని వారు పేర్కొన్నారు

# జిల్లా కలెక్టర్ ను కలిసిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



తుగ్గలి మండల పరిధిలోని గల రాతన ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల తనిఖీకు వచ్చిన జిల్లా కలెక్టర్ సిరి ను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర మంగళవారం రోజున మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాతన గ్రామానికి విచ్చేసిన కలెక్టర్ కు ఆయన కండువాను అందజేసి వినతి పత్రాన్ని అందజేశారు.రైతులను దృష్టిలో ఉంచుకొని వారి సమస్యలను పరిష్కరించాలని తుగ్గలి నాగేంద్ర, రాతన మనోహర్ చౌదరి లు జిల్లా కలెక్టర్ కు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ భరత్ నాయక్,తుగ్గలి తహసిల్దార్ రవి, ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు,ఎంపీడీవో విశ్వమోహన్,తదితర వివిధ శాఖల మండల అధికారులు,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో ప్రతిభ కనబరిచిన సాధన విద్యానికేతన్ పాఠశాల విద్యార్థి

**విద్యార్థి ముల్లా అక్రమ్ ను అభినందించిన స్కూల్ కరస్పాండెంట్ దండు భాస్కర్.**

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



69వ స్కూల్ గేమ్స్ ఫౌండేషన్ అండర్ -14 క్రికెట్ విభాగంలో తుగ్గలి సాధన విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థి ముల్లా అక్రమ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ దండు భాస్కర్ యాదవ్ తెలియజేశారు. మంగళవారం రోజున ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా చాలా అవసరమని,క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కల్పిస్తాయని ఆయన తెలియజేశారు.పెరవలి గ్రామానికి చెందిన సాధారణ గ్రానైట్ వర్కర్ ముల్లా అనీఫ్ కుమారుడు ముల్లా అక్రమ్ క్రికెట్ పోటీలలో మెరుగైన ప్రదర్శనను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఆయన తెలియజేశారు. సాధనా విద్యానికేతన్ నందు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు గతంలో రోప్ స్కిప్పింగ్ పోటీలలో జాతీయస్థాయిలో ఎంపిక కావడం,నేడు క్రికెట్ పోటీలలో రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం చాలా సంతోషకరమని ఆయన తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి ముల్లా అక్రమ్ ను సాధనా విద్యానికేతన్ కరస్పాండెంట్ దండు భాస్కర్,పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక

# రాతన ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సిరి

## ఆశ్రమ పాఠశాలలో తెలుగు టీచర్ ను నియమించాలని అధికారులకు ఆదేశాలు జారీ.

## ఉల్లి రైతుల గ్రేడింగ్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్.

తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:



తుగ్గలి మండల పరిధిలోని గల రాతన గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను కర్నూలు జిల్లా కలెక్టర్ ఏ.సిరి మంగళవారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భాగంగా పాఠశాల తరగతి గదులను,వసతి గృహాలను మరియు వంటగదిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆమె మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వ మెనూ ఆధారంగా భోజన సౌకర్యాన్ని కల్పించాలని,పాఠశాల యందు అన్ని మెరుగైన వసతులను కల్పించాలని, వంటశాల యందు పరిశుభ్రతను పాటించాలని ఆమె తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో సంభాషిస్తూ ఆశ్రమ పాఠశాలలో గల వసతుల గురించి, లోటుపాటుల గురించి విద్యార్థుల ద్వారా అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాల యందువిద్యార్థుల కోసం వండిన భోజనాన్ని భుజించి ఇదేవిధంగా భోజనాన్ని విద్యార్థులకు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆశ్రమ పాఠశాల యందు తెలుగు టీచర్ లేనందున విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసి వెంటనే తెలుగు టీచర్ ను నియమించాలని మండల విద్యాధికారికు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల యందు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు తెలియజేశారు. ఆశ్రమ పాఠశాల యందు గల విద్యార్థులకు సంబంధించి మరుగుదొడ్ల మరమ్మత్తులు,

డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా త్వరలోనే వాటి సమస్యలను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. అదేవిధంగా రాతన గ్రామ సమీపంలో

ఉల్లి రైతులు చేస్తున్న ఉల్లిగడ్డ గ్రేడింగ్ ను పరిశీలించారు. రైతుల ద్వారా వారి సమస్యలను అడిగి జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. రైతులందరూ ఉల్లిగడ్డను సరిగ్గా గ్రేడింగ్ చేసుకొని మార్కెట్ కు తరలిస్తే ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ఆమె రైతులకు తెలియజేశారు. త్వరలోనే ప్రభుత్వం అందజేసే ఉల్లి పంట నష్టపరిహారం కూడా రైతులు ఖాతాలో జమవుతుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్,తుగ్గలి తహసిల్దార్ రవి,తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్,ఈఓఆర్డి శ్రీహరి, మండల విద్యాధికారులు రమా వెంకటేశ్వర్లు, మాలతి,మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు,ఏపీవో హేమ సుందర్,ఆర్ఐ వెంకటరాముడు,రాతన విఆర్ఓ నాగేంద్ర,పంచాయతీ కార్యదర్శి శివ, రాతన గ్రామ టిడిపి నాయకులు మనోహర్ చౌదరి,వ్యవసాయ శాఖ అధికారులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మొంథా సైక్లోన్ డ్యూటీ పై వెళ్లిన బేతంచర్ల విద్యుత్ అధికారులు

బేతంచేర్ల : ఉత్తేజిత ప్రతినిధి :

ఆంధ్ర రాష్ట్రంలో వరదలతో బీభత్సం సృష్టిస్తున్న మొంథా సైక్లోన్ దృష్ట్యా బేతంచెర్ల విద్యుత్ శాఖ అధికారులు ఏడి మధుసూదన్ రెడ్డి,మరియు రూరల్ ఏఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లాకు ఎమర్జెన్సీ రిస్క్ టీం గా సోమవారం బయలుదేరి వెళ్లినట్లు ఏడి మంగళవారం ఓ ప్రకటనలోతెలిపారు. ఆయన మాట్లాడుతూ...ఆలమూరు మండలం కోనసీమ బిఆర్ అంబేద్కర్ జిల్లా కు రిస్క్ టీంగా ఎలక్ట్రిసిటీ సబ్ డివిజన్ బేతంచర్ల నుండి10 మంది విద్యుత్ శాఖ సిబ్బంది బయలుదేరి వెళ్లినట్లు ఆయన తెలిపారు.

# త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టి, ప్రతిరోజూ నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించండి.

## హథిరాంజీ మఠంను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ (ఇంచార్జ్), కమిషనర్ ఎన్. మౌర్య.

తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, అక్టోబర్ 28.



నగరంలోని ప్రజలకు పంపిణీ చేస్తున్న త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించి సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ (ఇంచార్జ్), కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని వర్షప్రభావిత ప్రాంతాలైన ఎస్టీవీ నగర్, కేశవాయన గుంట, ఎస్.జి.ఎస్. కాలేజీ రోడ్డు, గొల్లవాణిగుంట, కోరమేనుగుంట, పూలవాణిగుంట, సింగాలగుంట, కేశవాయన గుంట, లక్ష్మీపురం కూడలి, గాంధీరోడ్డు లోని హథిరాంజీ మఠం తదితర ప్రాంతాలను అధికారులతో కలసి పరిశీలించారు. హథిరాంజీ మఠం వద్ద అన్ని భద్రతా ఏర్పాట్లు చెపట్టాలని, వర్షాలు తగ్గే వరకు దుకాణదారులు మూసివేయాలని తెలిపారు. వర్షాల వలన నీరు ఎక్కడా కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని, నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఎక్కడైనా కలుషితం అయితే నీటి సరఫరా ఆపివేయాలని, త్రాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలాని తెలిపారు. వర్షాల వలన జబ్బులు వచ్చే అవకాశం ఉందని, పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని, ఎప్పటికప్పుడు మురుగునీటి కాలువల్లో చెత్త తొలగించాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు వారిని దగ్గరలోని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. పురాతనమైన, కూలిపోయే అవకాశం ఉన్న భవనాల్లో నివాసం ఉండకుండా, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రజలకు సూచించారు. కమిషనర్ వెంట కార్పొరేటర్లు ఆంజనేయులు, నరసింహ ఆచారి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, డి.ఈలు, లలిత, రాజు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు




పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలలను కొనసాగించే జీవో నెంబర్: 509 రద్దు చేయాలి బి.గిడ్డయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు అక్టోబర్ 28 మంగళవారం

ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్, ప్రైవేట్ పార్ట్నర్షిప్(PPP) పేరుతో ప్రైవేటీకరణ చేస్తే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు.

# తుపాన్ నేపథ్యంలోప్రజలు అప్రమత్తం గా ఉండాలి - విద్యుతు శాఖ ఎడి

బేతంచర్ల : ఉత్తేజిత ప్రతినిది



: మొంథా తుపాన్ దృష్ట్యా బేతంచెర్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏడి మధుసూదన్ రెడ్డి,మంగళవారం ఓప్రకటనలోతెలిపారు. ఆయన మాట్లాడుతూ... వర్షాల సమయంలోమండల ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు విద్యుత్ శాఖ సూచనలు తడిచేతులతో స్విచ్ బోర్డును తాగరాదు పిల్లలను విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచండి ఇంటి గృహోపకరణాల స్విచ్ లను అవసరం లేనిచో ఆఫ్ చేయండి తెగిన తీగలకు,పడిపోయిన స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లకు ఎల్లప్పుడూ కరెంటు ఉన్నట్లుగా పరిగణించి ప్రజలు దూరంగా ఉండాలని,మీ భద్రత - మా బాధ్యత అని ఆయన అన్నారు.

# ఎల్ఐసి ఉనికికే ప్రమాదం !




ఆదానీతో మోడీ బంధం ఎంతో బలమైనది. అది ఫెవికాల్ లాంటిది. దానిని విడదీయడం అంత సులువు కాదు. గత పదేళ్లుగా ఇది రుజువైన విషయం. ఆదానీ కంపెనీపై వరుసగా విమర్శలు వస్తున్నా ..ఏనాడూ చర్యలు తీసుకోలేదు. సరికదా ఖండించడానికి కూడా ప్రధాని మోడీ పెదవి విప్పలేదు. ఆదానీ వ్యవహారంపై గతంలో పార్లమెంట్ స్తంభించింది. ఆదానీ గ్రూపు ఆర్థిక అవతవకలు, అమెరికా సంస్థ ఆరోపణలు అలా ఉండగానే తాజగా ఆ కంపెనీకి ఎల్ఐసి మొత్తాన్ని ధారపోసారు. గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిచింది. ప్రతిష్ఠాత్మక ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత జీవిత బీమా సంస్థ ఎల్ఐసిని అదానీ ప్రయోజ నాల కోసం కేంద్ర ప్రభుత్వం బలి పెట్టడంపై వస్తున్న విమర్శలను సైతం పట్టించుకోవడం లేదు. అంటే ప్రధాని మోడీ తన ప్రధాని పదవిని అడ్డం పెట్టి ఆదానీకి అండగా నిలబడ్డారని వేరుగా చెప్పనక్కరలేదు. కోట్లాదిమంది పాలసీదారుల, ఉద్యోగుల, అధికారుల ప్రయోజనాలను అదానీ వ్యాపార కాంక్షకు సమిధలు చేయడం అమానుషం. నిజానికి గతంలోనే ఎల్ఐసిని ప్రైవేటీకరించాలని చూశారు. దీనిపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వచ్చాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ను సైతం ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేశారు. కానీ బిజెపికి పూర్తి మెజార్టీ రాకపోవడం, ఎపిలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడడంతో ఆగిపోయింది. ఎల్ఐసిని ప్రైవేటీకరిస్తే ఆదానికి అప్పగించేవారేమో అన్న అనుమానాలు ఇప్పుడు కలుగుతున్నాయి. దేశీయంగా ఉన్న కంపెనీలను ఇలా తన తాబేదార్లకు కట్టబెట్టే కుట్ర లోపాయకారిగా జరుగుతున్నదని ప్రజలు గుర్తించాలి. ఎల్ఐసి మొత్తాలను ఆదానికి అప్పుగా బదిలీ చేయడంపై దేశంలో అప్పుడే నిరసనలు మొదలయ్యాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలుగు రాష్ట్రాల్లో లెఫ్ట్ నేతలు కూనంనేని సాంబశివరావు, బివి రాఘవులు వంటివారు, మరికొందరు నిరసనల గళం విప్పారు. బీహార్ ఎన్నికల సందడిలో ఇదంతా గుట్టు చప్పుడు కాకుండా సాగిపోతోంది. సామాన్యుల చెమట చుక్కలే పెట్టుబడిగా ఎదిగిన ఎల్ఐసికి చెందిన వేల కోట్ల రూపాయల మొత్తాన్ని అదానీ గ్రూపునకు గుట్టుచప్పుడు కాకుండా మళ్ళించేందుకు అత్యున్నత స్థాయిలో కుట్ర జరిగిందన్నది చెప్పకనే చెప్పవచ్చు. అమెరికా నుండి వెలువడే 'వాషింగ్టన్ పోస్ట్' పత్రికలో ఈ కథనం తొలుత రావడం గమనార్హం. అంతర్జాతీయంగా విత్తసంస్థలు అదానీకి అప్పులు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 3.9 మిలియన్ డాలర్లు అంటే 33 వేల కోట్ల రూపాయలను అదానీ గ్రూపునకు మళ్లించడానికి సిద్ధమైందని వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగానే అదానీ పోర్ట్స్ అనుబంధ సంస్థ రుణాల రీఫైనాన్స్ కోసం జారీ చేసిన 585 బిలియన్ డాలర్ల దాదాపు రూ.5,000 కోట్లు బాండ్లను ఎల్ఐసి కొనుగోలు చేసింది. 'అదానీపై లంచం, మోసం ఆరోపణలపై అమెరికా కోర్టుల్లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అనేక అమెరికా, యూరోపియన్ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడాయి. కానీ.. భారత ప్రభుత్వం మాత్రం అదానీ కోసం ప్రత్యేక ఆర్థిక మద్దతు ప్రణాళికను రూపొందించిందని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్), ఎల్ఐసి నుండి పొందిన అంతర్గత పత్రాలు సహా అధికారులు, బ్యాంకర్లతో ఇంటర్వ్యూల ఆధారంగా ప్రభుత్వం ఈ నిధుల మళ్లింపునకు ఏ విధంగా పాల్పడిందో గుర్తించామని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొందంటే పథకం ఎంత పకడ్బందీగా రూపొందించారో తేటతెల్లమవుతుంది. ఆదానీ పోర్ట్సు అప్పటికే తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడం కోసం బాండ్లను జారీ చేయాలని నిర్ణయించుకున్న సమయంలోనే ఉన్నత స్థాయిలో ఎల్ఐసి నిధుల తరలింపునకు సంబంధించిన ప్రణాళిక సిద్ధమైందని అర్థం అవుతోంది. మే 30వ తేదీన అదానీ పోర్ట్సు విడుదల చేసిన మొత్తం బాండ్లను ఎల్ఐసి కొనేసింది. అదానీ గ్రూపు షేర్లు, బాండ్లు కొనడానికి విదేశీ విత్త సంస్థలేవీ సిద్ధం కాని నేపథ్యంలో భారత ప్రభుత్వరంగ బీమా సంస్థచేత కొనిపించి, అదానీ గ్రూపునకు విశ్వసనీయత కల్పించాలన్నదే ఆ పథకంలో భాగంగా అర్థం చేసుకోవచ్చు. ఆ పాచిక పారింది కనుకనే అంతకు ముందు వెనక్కి తగ్గిన అమెరికా సంస్థ ఏథెన్ ఇన్సూరెన్స్ జూన్లో 750 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.6,650 కోట్లు పెట్టుబడులు పెట్టింది. ఆదానీ ఆర్థిక అక్రమాలు, అవినీతిపై 2023 జనవరిలో హిండెన్బర్గ్ రీసెర్చ్ వరుస రిపోర్టులను విడుదల చేసింది. అదానీ కృత్రిమంగా తన కంపెనీల షేర్లను పెంచుకుంటున్నారని.. డొల్ల కంపెనీలతో పన్నులు ఎగ్గొడుతున్నారని విశ్లేషించింది. అదానీ కంపెనీలు ప్రమాదకర అప్పుల్లో ఉన్నాయని కూడా వెల్లడించిన విషయం తెలిసిందే. దీనికి తోడు తాజాగా వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ ఇటు ప్రభుత్వ వర్గాల్లోనూ, అటు ఇన్వెస్టర్లు, కార్పొరేట్ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి తమపై ఎవరి ఒత్తిళ్లు లేవని ఎల్ఐసి పేర్కొంది. బోర్డు ఆమోదించిన విధి విధానాల మేరకే తాము పెట్టుబడులు పెడతామని, వాటిపై తమదే తుది నిర్ణయమని బుకాయించింది. అందువల్ల ఎల్ఐసిలో ఏం జరుగుతుందో దేశ ప్రజలకు తెలపడం ప్రభుత్వ బాధ్యత. ఈ వ్యవహారంపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించడం అవసరమన్న డిమాండ్ను కూడా ఆమోదిం చాలి. ఇంతపెద్ద మొత్తంలో వ్యవహారం గుంభనంగా సాగడాన్ని అడ్డుకోవాలి. ఎల్ఐసిని మరోమారు ప్రైవేట్ రంగానికి అప్పగించే కుట్రలో కూడా ఇదో భగంగా చూడాలి. అందుకోసం ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడి పెరచాలి. పాలకుల కార్పొరేట్ అనుకూల నిర్ణయాలపై నిలదీయాలి. లేకుంటే ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ కావడం ఖాయం. దీనిపై విపక్ష కాంగ్రెస్ గట్టిగా నిలబడాలి. నిజానిజాలను వెల్లడించేందుకు పోరాటం చేయాలి. ఓట్ చోరీ పక్కన పెట్టి ఎల్ఐసిని రక్షించే పోరాటానికి దిగాలి. అందుకు దేశంలోని ప్రజలు కూడా అడుగులు వేయాలి.

# కంబదహాల్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ అక్టోబర్ 28



సి.బెళగల్ మండలం కంబదహాల్ గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంవల్ల, తరచుగా ప్రమాదంలో జరిగి,ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి, కేడిసిసి బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం రోడ్డు ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంబదహాల్ మండల కేంద్రం నుండి కంబదహాల్ గ్రామం వరకు ప్రధాన రోడ్డు మంజూర అయిందని అతి త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు మొదలుపెట్టాలని రోడ్లు మరియు భవనాల శాఖ ఎస్.ఈ మహేశ్వర్ రెడ్డిని ఆదేశించారు. కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోడ్లకు మహర్దశ కల్పిస్తామని, రహదారులన్నీ గుంతలమయం లేకుండా నాణ్యమైన రోడ్లు నిర్మిస్తారని మాట ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం అతి త్వరలోనే రోడ్డు పనులు మొదలు పెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.బెళగల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సింగిల్ విండో అధ్యక్షుడు చిన్న తిమ్మప్ప, తెలుగుదేశం సీనియర్ నాయకులు అమర్నాథ్, స్థానిక నాయకులు సత్యనారాయణ రెడ్డి, లక్ష్మీకాంత, యాకోబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయంగా ట్రేడ్ మార్పులు

హైదరాబాద్: దీపావళి సమయంలో ఉవ్వెత్తున ఎగసిన పసిడి ధర దిగొచ్చింది. అంతర్జాతీయ పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాలతో దిద్దుబాటుకు గురైంది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4 వేల డాలర్ల స్థాయి దిగువకు చేరింది. అమెరికా– చైనా మధ్య త్వరలో ట్రేడ్ డీల్ కుదరొచ్చన్న అంచనాలు ఈ కరెక్షన్‌కు కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య అక్టోబర్ 30న జరిగే భేటీలో ఆ మేర కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందన్న అంచనాలతో పుత్తడికి డిమాండ్ తగ్గినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఇటీవలి వరకూ చుక్కలనంటిన పసిడి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. మంగళవారం కూడా పసిడి, వెండి ధరల్లో తగ్గుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ. 820 మేర తగ్గి రూ.1,22,460కు చేరుకుంది. ఇక ఆర్నమెంటల్ బంగారం ధర రూ.750 మేర తగ్గి 1,12,250కు చేరుకుంది. వెండి ధరల్లో కూడా భారీ కోత పడింది. కిలో వెండి ధర సుమారు రూ.4 వేల మేర తగ్గి రూ.1,51,000కు చేరుకుంది. ఇక హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ.1,22,460గా ఉంది. ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,12,250గా ఉంది. కిలో వెండి ధర మాత్రం రూ.1.65 లక్షలుగా ఉంది. ఇక అంతర్జాతీయ మార్కెట్ లోనూ పసిడి ధరల్లో భారీ తగ్గుదల కనిపిస్తోంది. ఔన్స్ 24 క్యారెట్ బంగారం 3986 డాలర్ల వద్ద కొనసాగు తోంది. నిన్నటితో పోలిస్తే సుమారు 3 శాతం మేర ధరల్లో కోత పడింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ డిసెంబర్ ఫ్యూచర్స్ ధర కూడా 2.35 శాతం మేర తగ్గి రూ.1,20,546 వద్ద కొనసాగుతోంది. మలేషియా వేదికగా అమెరికా, చైనా ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సానుకూల ఫలితాలను ఇచ్చాయి. ఎగుమతుల పై నియంత్రణలు, డ్రగ్స్ కట్టడి, షిప్పింగ్ లెవీల వంటి వాటిపై ఇరు దేశాల మధ్య ప్రాథమిక స్థాయిలో ఏకాభిప్రాయం కుదరడంతో బంగారానికి డిమాండ్ తగ్గింది.

ఉత్తేజిత దినపత్రిక



# అయోధ్య, వారణాసికి టూర్ ప్యాకేజీలు..

తెలంగాణ: టీజీఎస్ఆర్టీసీ సేవలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్లకు సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతగా ప్రారంభించిన 'యాత్రాదానం' ప్రాధాన్యతను వివరించాలని అలాగే పెళ్లిళ్లు, శుభకార్యాలకు బస్సుల బుకింగ్, కార్గో సేవలను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్ల సమావేశంలో సజ్జనార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిపోకు ముగ్గురు చొప్పున బస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్లు తమ ప్రాంతాల్లో ప్రత్యేకమైన, శుభ సందర్భాలలో యాత్రాదానంలో భాగంగా అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులను పుణ్యక్షేత్రాలు లేదా పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సజ్జనార్ సూచించారు. యాత్రాదానం కార్యక్రమానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 21 వేలకు పైగా అద్దె బస్సులు బుక్ చేసినందుకు విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్ల పనితీరును సజ్జనార్ ప్రశంసించారు. రాబోయే బతుకమ్మ, దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

టీజీఎస్ఆర్టీసీ ఇటీవల ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీలకు మంచి స్పందన లభిస్తోందని.. త్వరలోనే అయోధ్య, వారణాసి వంటి పుణ్యక్షేత్రాల టూర్ ప్యాకేజీలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. ఉద్యోగుల నిబద్ధత, అంకితభావం వల్లే సంస్థ ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గడపకు ఆర్టీసీ సేవలను తీసుకెళ్లడమే విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్ల ప్రధాన లక్ష్యం. వీరు తమ పరిధిలోని గ్రామాల్లో, కాలనీల్లో ప్రజలతో నిరంతరం సంప్రదిస్తూ ఉంటారని.. బస్సుల రాకపోకలు, సమయాలు, కొత్త రూట్లు వంటి సమాచారాన్ని సేకరించి, వాటిని ఉన్నతాధికారులకు చేరవేస్తారన్నారు. అలాగే, శుభకార్యాలు, జాతరల వంటి వాటికి అద్దె బస్సులను బుక్ చేసుకోవాలని ప్రజలకు వివరిస్తారన్నారు. క్షేత్రస్థాయి సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకొచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేస్తారని సజ్జనార్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఈడీలు మునిశేఖర్, వెంకన్న, సోలోమన్, ఖుష్రోషాఖాన్, రాజశేఖర్, సీటీఎంలు



శ్రీదేవి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉందని, పెండింగ్ అంశాలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు సజ్జనార్ హామీ ఇచ్చారు.

# అలా చేస్తే 8 రోజుల జైలు శిక్ష

హైదరాబాద్: నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు జీహెచ్ఎంసీ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. రోడ్లపై చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ' స్పెషల్ డ్రైవ్' పేరుతో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా.. రోడ్డు మీద చెత్త వేస్తే చట్టంలోని సెక్షన్ల ప్రకారం 8 రోజుల జైలు శిక్ష పడే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బోరబండ పోలీసులు గత రెండు రోజుల్లో రోడ్లపై చెత్త వేసిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఛార్జిషీటు దాఖలు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరచగా.. న్యాయమూర్తి వారికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు. ఈ కేసు ఒక హెచ్చరికగా ఉంటుందని.. ఇకపై చెత్త వేసే వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నగరంలో చెత్త సమస్య తీవ్రంగా ఉంది. రోడ్లపై, నాలాల్లో చెత్త వేయడం వల్ల పర్యావరణ సమస్యలు, డెంగ్యూ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాకాలంలో



మురుగునీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ సమస్యను ఎదుర్కోవడానికి పోలీసులు, జీహెచ్ఎంసీ సంయుక్తంగా ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న జరిమానాలు తక్కువగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో జరిమానాను పెంచే అవకాశం ఉందని మొదటిసారి పట్టుబడిన వారికి జరిమానా, రెండోసారి అదే తప్పు చేస్తే జైలు శిక్ష విధించవచ్చని అధికారులు తెలిపారు. కేవలం పోలీసు చర్యలు మాత్రమే కాకుండా.. ఈ సమస్య పరిష్కారానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరం. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చెత్తను రోడ్లపై వేయకుండా, చెత్త బుట్టలలో వేయాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి జీహెచ్ఎంసీ వాహనాలకు అప్పగించాలని అధికారులు కోరుతున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, రీ సైక్లింగ్ ప్రక్రియను ప్రోత్సహించడం వంటి చర్యలు కూడా తీసుకోవాలని అంటున్నారు. పోలీసులు, జీహెచ్ ఎంసీ చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్ వల్ల నగరంలో పరిశుభ్రత పెరుగుతుందని, ప్రజలు బాధ్యతగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నారు.

# యువతి రాపిడో కష్టాలు..!

**'ఇలాంటి వెధవల వల్లే కష్టపడి పని చేసుకునే వారికి చెడ్డపేరు'..**

హైదరాబాద్: రాపిడో వంటి బైక్ ట్యాక్సీ డ్రైవర్లు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు పాల్పడుతున్నారు. ప్రయాణికుల భద్రతను పణంగా పెడుతూ చాలా మంది డ్రైవర్లు బైక్ నడుపుతున్నప్పుడు ఫోన్‌లో మాట్లాడుతూ, మెసేజ్‌లు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా హైదరాబాద్ నగరానికి చెందిన ఒక యువతి రాపిడో సర్వీస్ గురించి, డ్రైవర్ నిర్లక్ష్యం గురించి ట్విట్టర్‌లో తన ఆవేదను పంచుకున్నారు. ఆమె చెప్పిన మాటలు రాపిడో వంటి టూ-వీలర్ క్యాబ్ సర్వీసులలోని భద్రతా లోపాలను, డ్రైవర్ల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. చాలామంది ప్రయాణికులు ఇలాంటి చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారు. 'ఈరోజు కాస్త ఒంట్లో బాలేదు. నా స్కూటీ ఇంట్లో పెట్టి.. రాపిడో బుక్ చేసుకున్నాను. నా కర్మ కొద్దీ ఇతను వచ్చాడు. అతనికి హెల్మెట్ లేదు, కేర్ లేదు. రాష్ డ్రైవింగ్, ఫోన్ మాట్లాడుతూ వెళ్తున్నాడు. రాంగ్ రూట్‌లో వెళ్లకండి.. యూ టర్న్ చేసుకోండి అంటే కోపంతో ఇంకా స్పీడ్‌గా వెళ్లాడు. మీరు ఎప్పుడైనా ఇలాంటి రాపిడో సర్వీస్ ఫేస్ చేసారా?' అంటూ రాసుకొచ్చింది.

రాపిడో సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం డ్రైవర్, ప్రయాణికుడికి హెల్మెట్ తప్పనిసరి. కానీ చాలా మంది డ్రైవర్లు దీనిని పాటించడం లేదు. ఈ యువతి విషయంలో కూడా ఇదే జరిగింది. డ్రైవర్ హెల్మెట్ ధరించకపోవడమే కాకుండా.. ప్రయాణికురాలికి కూడా హెల్మెట్ ఇవ్వలేదు. ఇది భద్రతా ప్రమాణాల ఉల్లంఘన మాత్రమే కాదు, ప్రమాదాలకు దారితీసే నిర్లక్ష్యం కూడా. రాష్ డ్రైవింగ్, ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం, ప్రయాణికుల సూచనలను పట్టించుకోకపోవడం వంటివి డ్రైవర్ల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఈ యువతి విషయంలో డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, సరైన మార్గంలో వెళ్లమని చెప్పినందుకు కోపంతో వేగం పెంచడం వంటివి మరింత దారుణం.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వకపోతే, రాపిడో సర్వీసులు విశ్వసనీయతను కోల్పోతాయి. ఈ సంఘటనపై సంస్థ స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వెధవల వల్లే కష్టపడి రాపిడో నడుపుకునే వారికి చెడ్డపేరు వస్తుందని అంటున్నారు. రాపిడో లాంటి సంస్థలు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా, డ్రైవర్లకు కఠినమైన నిబంధనలు విధించి, వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రయాణికుల ప్రాణాలకే ప్రమాదం.

# అంబులెన్స్ వద్దకు వచ్చి న్యాయమూర్తి విచారణ..



ములుగు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడికి న్యాయస్థానం అండగా నిలిచి మానవీయతను చాటింది. జాతీయ లోక్ అదాలత్‌లో జరిగిన విచారణ సందర్భంగా.. బాధితుడి పరిస్థితిని అర్థం చేసుకున్న న్యాయమూర్తి నేరుగా అంబులెన్స్ వద్దకే వచ్చి విచారణ జరిపారు. ఈ కేసులో బాధితుడికి రూ.కోటి పరిహారం చెల్లించాలని బీమా సంస్థను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన జాపతి దీక్షిత్ (22) బాచుపల్లిలో ఇంజినీరింగ్ రెండో ఏడాది చదువుకుంటున్నాడు. 2023 ఆగస్టు 12న స్నేహితులతో కలిసి అనంతగిరి హిల్స్‌కు విహారయాత్రకు వెళ్లగా.. మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమైంది. దీంతో అతడి శరీరం చచ్చుబడిపోయింది. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన దీక్షిత్ తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, పద్మ తమ స్తోమతకు మించి సుమారు రూ.60 లక్షలు అప్పు చేసి అతడికి చికిత్స చేయించారు. ఈ క్రమంలో గో డిజిట్ ఇన్సూరెన్స్ సంస్థపై రూ.1.50 కోట్ల పరిహారం కోసం కేసు వేశారు. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో ఈ కేసు విచారణకు వచ్చింది. బాధితుడు దీక్షిత్ తీవ్ర అనారోగ్యంతో కదల్లేని స్థితిలో అంబులెన్స్‌లో ఉన్నాడని తెలుసుకున్న న్యాయ సేవా సమితి చైర్‌పర్సన్, 12వ అదనపు చీఫ్ జడ్జి షౌకత్ జహాన్ సిద్ధిఖీ ఏమాత్రం సంకోచించకుండా నేరుగా అంబులెన్స్ వద్దకే వెళ్లారు. అక్కడ దీక్షిత్ ఆరోగ్య పరిస్థితిని, అతడి తల్లిదండ్రుల బాధను స్వయంగా చూశారు. వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్నారు.

న్యాయమూర్తి షౌకత్ జహాన్ సిద్ధిఖీ మానవత్వాన్ని చాటుకున్నారు. బాధితుడికి తక్షణ సాయం అవసరాన్ని గుర్తించిన న్యాయమూర్తి.. నెల రోజుల్లోపు రూ.కోటి పరిహారాన్ని నేరుగా దీక్షిత్ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని బీమా సంస్థను ఆదేశించారు. దీనికి బీమా సంస్థ ప్రతినిధులు కూడా అంగీకరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి చొరవను, మానవత్వాన్ని పలువురు కొనియాడారు. న్యాయం కేవలం కోర్టు గదుల్లోనే కాకుండా.. అవసరం ఉన్నచోట కూడా అందించవచ్చని న్యాయమూర్తి నిరూపించారు. ఈ తీర్పు దీక్షిత్ కుటుంబానికి గొప్ప ఊరటనిచ్చింది.

# పట్టాలెక్కిన హైదరాబాద్ టు యాదాద్రి ఎంఎంటీఎస్ ప్రాజెక్టు..

**రూ.20 టికెట్‌తో గంటలోపే చేరుకోవచ్చు..!**



హైదరాబాద్: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లే భక్తుల కోసం రైల్వే శాఖ కీలక అడుగు వేసింది. హైదరాబాద్ టు యాదాద్రికి ఎంఎంటీఎస్ ఫేజ్-2 విస్తరణ ప్రాజెక్టును పట్టాలు ఎక్కించింది. సుమారు రూ.412 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదట హైదరాబాద్ శివారు ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు అనుకున్న ఈ ప్రాజెక్టును ఇప్పుడు వంగపల్లి వరకు పొడిగించారు. దీంతో ఈ మార్గం పొడవు 35 కిలోమీటర్ల నుంచి 41 కిలోమీటర్లకు పెరిగింది.

ఈ ప్రాజెక్టు కింద సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, సివిల్ పనులను కాంట్రాక్టులకు అప్పగించారు. ఈ పనులను రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ సంస్థ పర్యవేక్షిస్తుంది. 2016-17లో ఈ ప్రాజెక్టుకు రూ.330 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు లభించింది. అప్పట్లో తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు వ్యయంలో మూడింట రెండు వంతులు భరిస్తామని చెప్పినా, నిధులు విడుదల చేయడంలో జాప్యం జరిగింది. అయితే, గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం మొత్తం వ్యయాన్ని తానే భరిస్తుందని ప్రకటించింది. జాప్యం కారణంగా ఇప్పుడు వ్యయం రూ.412.26 కోట్లకు పెరిగింది.

మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో 18.62 హెక్టార్ల ప్రైవేటు భూమిని సేకరించాల్సి ఉంది. భూసేకరణ ప్రక్రియ కూడా తాజాగా మొదలైంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశలో వంగపల్లి- యాదాద్రి (రాయగిరి)- భువనగిరి- పగిడిపల్లి మార్గాన్ని 2026-27 నాటికి పూర్తి చేయాలని యోచిస్తున్నారు. రెండో దశలో పగిడిపల్లి- బీబీనగర్- ఘట్‌కేసర్ మార్గాన్ని 2027-28 నాటికి పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే యాదగిరిగుట్టకు వెళ్లే భక్తులకు ప్రయాణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. హైదరాబాద్ నగరం నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రూ.20 టికెట్‌తో గంటలోపే చేరుకోవచ్చు.

# పాత బస్తీ మెట్రోపై కీలక అప్డేట్..



హైదరాబాద్: పాతబస్తీ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతి రాగానే టెండర్లు పిలిచేందుకు సిద్ధంగా ఉంది. నవంబర్ నాటికి అనుమతులు వస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతాయి. అయితే నిర్మాణానికి కనీసం రెండున్నరేళ్లు పట్టే అవకాశం ఉంది. మెట్రో అధికారులు నవంబర్ నాటికి అనుమతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కసరత్తును ఇప్పటికే పూర్తి చేశారు. పాతబస్తీ మెట్రో మార్గం హైదరాబాద్‌లో మెట్రో విస్తరణలో ఒక కీలక భాగంగా మారనుంది. కొత్తగా ప్రతిపాదించిన ఈ మెట్రో మార్గం ఇప్పటికే ఉన్న కారిడార్లకు పొడిగింపు కావడంతో కేంద్రం కొన్ని కీలక అంశాలపై వివరణ కోరింది.

ముఖ్యంగా తొలి దశ మెట్రోను నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రోతో టికెటింగ్, ఆదాయం, నిర్వహణ ఎలా పంచుకుంటారనే అంశంపై కేంద్రం ప్రశ్నలు లేవనెత్తింది. నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ సమస్య కాదని అధికారులు తెలిపారు. ఇప్పుడున్న ఎల్అండ్‌టీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించడమో, లేదా థర్డ్ పార్టీకి అప్పగించి ఆదాయాన్ని పంచుకోవడమో చేస్తామని వివరించారు. ఈ రెండు ఆప్షన్లలో రెండో దానికే ఎల్అండ్‌టీ మొగ్గు చూపుతోంది. ఒకవేళ స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి నిర్వహణ అప్పగించడానికి సిద్ధమని ఎల్అండ్‌టీ పేర్కొంది. ప్రస్తుత ప్రభుత్వం రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి పాతబస్తీ మెట్రో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే అధికారుల అంచనా ప్రకారం ఈ పనుల పూర్తికి కనీసం రెండున్నరేళ్లు పట్టే అవకాశం ఉంది. సమయం తక్కువగా ఉండటం, పనులకు అవసరమైన 'రైట్ ఆఫ్ వే' (నిర్మాణానికి మార్గం) సిద్ధంగా ఉండటంతో టెండర్ల జారీకి అత్యవసరంగా చర్యలు తీసుకుంటున్నారు. కాగా, నష్టాల కారణంగా ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని ఎల్అండ్‌టీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రద్దీకి తగ్గ కోచ్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కేంద్రం వివరణ కోరింది. దీనిపై సంస్థ త్వరలో కొత్త కోచ్‌లను కొనుగోలు చేస్తామని బదులిచ్చింది.

మెట్రో రైలు సంస్థ కేంద్రం అడిగిన అన్ని వివరణలు ఇచ్చామని దీపావళి తర్వాత ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒక శుభవార్త వినే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేస్తోంది. పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత ప్రజల ప్రయాణ కష్టాలు చాలా వరకు తగ్గుతాయి.

# డిగ్రీ విద్యార్థిని హత్యాచార నిందితుడికి జీవిత ఖైదు..!

కరీంనగర్: డిసెంబర్ 16, 2012లో ఢిల్లీలో చోటు చోటు చేసుకున్న నిర్భయ సామూహిక అత్యాచార ఘటన దేశాన్ని కుదిపేసిన సంగతి తెలిసిందే. మహిళల భద్రత, చట్టాల గురించి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలకు దారితీసింది. 23 ఏళ్ల ఫిజియోథెరపీ విద్యార్థిని ఆరుగురు వ్యక్తులు బస్సులోనే అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె స్నేహితుడిపై దాడి చేసి ఆ దారుణానికి ఒడిగట్టారు. 13 రోజుల పాటు ప్రాణాలతో పోరాడిన ఆమె.. ఆ తర్వాత ప్రాణాలు విడిచింది. కేసు ఘటన దేశవ్యాప్తంగా ప్రజలను ఆగ్రహానికి గురి చేసింది. ఈ ఘటన జరిగిన రెండ్రోజులకు అంటే డిసెంబర్ 18న అచ్చం అటువంటి ఘటనే అప్పటి ఉమ్మడి ఏపీ సిద్ధిపేటలో చోటు చేసుకుంది. డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థినిని



గ్యాంగ్ రేప్ చేసి దారుణంగా హతమార్చారు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన అఫ్సర్, నరేందర్, శ్రీనివాస్ అనే ముగ్గురు వ్యక్తులు ఈ ఘోరానికి పాల్పడ్డారు. అనంతరం పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోగా.. ఛార్జిషీట్ ఫైల్ చేశారు. సుదీర్ఘ న్యాయ పోరాటం అనంతరం ఈ ఘోరానికి పాల్పడిన కరీంనగర్‌కు చెందిన ముగ్గురు నిందితులలో ఒకడైన నరేందర్‌కు జీవిత ఖైదు పడింది. దాదాపు పన్నెండేళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత సెప్టెంబర్ 10, 2025న కోర్టు నరేందర్‌కు జీవిత ఖైదు విధించింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసును అణచివేయడానికి ప్రయత్నించిందని ఆరోపణలు వచ్చాయి. అప్పటి బీజేపీ కరీంనగర్ బీజేపీ అధ్యక్షుడు, కార్పొరేటర్, ప్రస్తుత కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఈ కేసును ప్రభుత్వం అణచివేస్తుందని తీవ్రంగా ఆరోపించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ పలు నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్భయ తరహా ఘటన జరిగితే కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. బాధితుల పక్షాల పోరాటం చేశారు. తాజాగా.. ఈ కేసులో నిందితుడిగా ఉన్న నరేందర్‌కు కోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. బాధితురా లి కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు. ఇది న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. ఈ తీర్పు ఇతర నేరస్తులకు ఒక హెచ్చరికగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కేసులో మిగిలిన నిందితులపై విచారణ కొనసాగుతుంది.

# ఈ జిల్లాల్లో కుండపోత వానలు..

తెలంగాణ: గత కొన్ని రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. జూన్ నెలలో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. ఆ తర్వాత జూలై చివరి వారం, ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికల ప్రకారం.. రాష్ట్రానికి మరోసారి వర్షం హెచ్చరికలు జారీ అయ్యాయి. నేటి నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కొనసాగే అవకాశముందని అధికారులు అంచనా వేశారు. నేడు కామారెడ్డి, సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మిగిలిన జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద రావడంతో నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల



ప్రాజెక్టుల గేట్లు తెరిచి నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 2.74 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో 26 గేట్లు ఎత్తి దిగువకు అదే మొత్తంలో నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 2.76 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా.. గేట్లు, విద్యుదుత్పత్తి, కాలువల ద్వారా 2.82 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు 1.57 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 1.63 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే..

తెలంగాణ: హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీ రాజధాని అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించతల పెట్టిన విషయం తెలిసిందే. 12 వరుసలతో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మిస్తున్నారు. ఈ హైవే సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ బాధ్యతలను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయానికి



అప్పగించనున్నారు. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించిన సిద్ధం చేయాలని ఇటీవల కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించినట్లు సమాచారం.

ఈ ఎక్స్‌ప్రెస్ హైవే మొత్తం పొడవు సుమారు 210-230 కిలోమీటర్లు ఉండవచ్చని అంచనా వేస్తోంది. ఈ హైవే హైదరాబాద్- విజయవాడ హైవేకు సమాంతరంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతుంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే కిలోమీటర్‌కు సుమారు రూ.40 కోట్ల చొప్పున మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.9 వేల కోట్లకు పైగా ఖర్చు అయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం గూగుల్ మ్యాప్ ఆధారంగా అంచనా వేసిన అలైన్‌మెంట్‌పై పూర్తి స్థాయి సర్వే తర్వాత స్పష్టత వస్తుంది. ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ నుండి ఈ రహదారిని నిర్మించాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు.

కేంద్రం నుంచి అనుమతులు రావడంతో ఎన్‌హెచ్ఏఐ త్వరలోనే తయారీకి కన్సల్టెన్సీని ఎంపిక చేసేందుకు బిడ్‌లను పిలవనుంది. ఎంపికైన కన్సల్టెన్సీ ఇచ్చే నివేదిక ఆధారంగానే తదుపరి టెండర్లకు వెళ్లే అవకాశం ఉంది. ఈ రహదారి నిర్మాణం ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో ఒక భాగం కాగా.. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణ సమయాన్ని కూడా గణనీయంగా తగ్గిస్తుందని, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ నుంచి రంగారెడ్డి జిల్లా యాచారం, నల్గొండ జిల్లా చండూరు, మునుగోడు, సూర్యాపేట మీదుగా ఈ రహదారిని నిర్మించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సైతం సిద్ధం అయ్యాయి.

# శ్రీవారితో పెట్టుకుంటే అంతే మరి!

తిరుమల: టీడీపీ ఎంపీ శబరి పేరుతో నకిలీ సంతకం చేసిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుమల దర్శనం కోసం ఒక లేఖను ఫోర్జరీ చేసి రవితేజ అనే వ్యక్తికి ఇవ్వడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఉద్యోగాలు, బదిలీల కోసం కూడా ఇలాంటి మోసాలకు పాల్పడ్డాడా అని పోలీసులు విచారణ చేస్తున్నారు.

టీడీపీ ఎంపీ సంతకం ఫోర్జరీ వ్యవహారం కలకలం రేపింది. సంతకం ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు తయారుచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నంద్యాల జిల్లా వెలుగోడు మండలం గుంతకందాల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు.. ప్రస్తుతం నంద్యాల పట్టణంలోని బైర్‌మల్ వీధిలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అతడి అన్నకు పరిచయం ఉన్న రవితేజ అనే మరో వ్యక్తి దగ్గర డబ్బులు తీసుకుని.. తిరుమల దర్శనం కోసం ఓ లేఖను ఇచ్చాడు. ఆ లేఖపై నంద్యాల ఎంపీ శబరి సంతకం ఫోర్జరీ చేశాడు. ఆ లేఖతో రవితేజ కుటుంబం తిరుమల శ్రీవారి దర్శనం కోసం వెళ్లింది. అయితే ఆ లేఖను దర్శనం కోసం టీటీడీ జేఈవో ఆఫీసులో ఇచ్చారు.

శ్రీవారి దర్శనం కోసం ఇచ్చిన లేఖ కొంచెం తేడాగా కనిపించింది.. టీటీడీ అధికారులకు అనుమానం వచ్చి వెంటనే ఎంపీ కార్యాలయాన్ని సంప్రదించారు. ఆ లేఖ గురించి ఫోన్‌లో ఆరా తీశారు. అయితే తాము తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఎవరికీ ఏ లేఖ ఇవ్వలేదని ఎంపీ శబరి కార్యాలయం సిబ్బంది టీటీడీ అధికారులకు తేల్చి చెప్పారు. అప్పుడు టీటీడీ అధికారులు రవితేజను నిలదీస్తే.. అప్పుడు వెంకటేశ్వర్లు బండారం బయటపడింది. వెంకటేశ్వర్లు దగ్గర తాను ఈ లేఖను కొనుగోలు చేసినట్లు రవితేజ చెప్పారు.. దీంతో మళ్లీ ఎంపీ కార్యాలయానికి టీటీడీ అధికారులు సమాచారం అందించారు.. ఎంపీ సంతకం ఫోర్జరీ అయినట్లు తేలింది.

ఆ వెంటనే ఎంపీ శబరి పీఏ బైరెడ్డి దినేష్ నంద్యాల వన్‌టౌన్ పోలీసుల్ని ఆశ్రయించారు. వెంకటేశ్వర్లు సంతకం ఫోర్జరీ చేయడంపై ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.. ఈ లేఖ వ్యవహారంపై ప్రశ్నిస్తున్నారు. అయితే అరెస్టైన వెంకటేశ్వర్లుపై పలు ఆరోపణలు ఉన్నాయి. వెంకటేశ్వర్లు పలువురు ప్రజాప్రతినిధుల పేర్లతో సంతకాలు ఫోర్జరీ చేసి లేఖలు ఇచ్చేవాడనే విమర్శలు ఉన్నాయి. ఉద్యోగాలు, బదిలీలకు సంబంధించి సైతం లేఖలు ఇచ్చినట్లు సమాచారం. ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ప్రజాప్రతినిధుల సంతకాలను ఫోర్జరీ చేశాడు. ఉద్యోగాలు, బదిలీల కోసం నకిలీ లేఖలు ఇచ్చాడు. ఉద్యోగాలు కావాలన్నా, బదిలీలు కావాలన్నా ఆ లేఖలను ఉపయోగించేవాడు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అసలు ఇతను ఎందుకు ఇలా చేశాడు? ఇంకా ఎవరెవరికి ఇలా లేఖలు ఇచ్చాడు? అనే విషయాలను పోలీసులు తెలుసుకుంటున్నారు. అయితే వెంకటేశ్వర్లు ఫోర్జరీ సంతకంతో తిరుమల శ్రీవారిని దర్శనం కోసం ప్రయత్నం చేశాడు.. ఆ వెంకన్నే అతడ్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టించాడు.

# రూ.10వేల నుంచి రూ.40వేలు ఉండే ఆ స్కాన్ ఉచితంగా..



గుంటూరు: ఆరోగ్యశ్రీ పథకం కింద పెట్ సీటీ స్కాన్ పరీక్షలను ఉచితంగా అందించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు నోరి దత్తాత్రేయుడు తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో 18 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక పెట్ సీటీ స్కాన్ పరికరం ఏర్పాటు కానుంది. ఇది అందుబాటులోకి వస్తే పేదలకు ఎంతో మేలు జరుగుతుందని, త్వరలోనే రోగులకు ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. బయట ఆస్పత్రుల్లో ఈ పరీక్షకు వేలల్లో ఖర్చవుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు నోరి దత్తాత్రేయుడు ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో పెట్ సీటీ స్కాన్ పరీక్షను ఉచితంగా అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. గుంటూరు సర్వజనాసుపత్రిలోని నాట్కో క్యాన్సర్ విభాగంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పెట్ సీటీ స్కాన్ పరికరాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో ఈ సదుపాయం అందుబాటులోకి వస్తే పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. ఆసుపత్రిలో చేరిన రోగులకు పెట్ సీటీ స్కాన్ అవసరమని వైద్యులు చెబితే.. ఆ పరీక్షను ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా చేయడానికి ప్రయత్నిస్తానని దత్తాత్రేయుడు హామీ ఇచ్చారు. దీనికి ప్రభుత్వం నుంచి అనుమతులు త్వరగా వచ్చేలా చూస్తానన్నారు. ఈ పరీక్ష ఖరీదైనదని.. దీనిని ఉచితంగా అందించడానికి ప్రయత్నిస్తానన్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో క్యాన్సర్ కణాలను గుర్తించే పెట్ సీటీ స్కాన్ పరికరం అందుబాటులోకి రానుంది. ఈ పరికరం ద్వారా శరీరంలో ఎక్కడ క్యాన్సర్ కణం ఉన్నా గుర్తించవచ్చు. దీని కోసం ప్రభుత్వం రూ.18 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పరికరం అందుబాటులోకి వస్తోంది. ఈ పరికరం బిగించే పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ స్కాన్‌ను వీలైనంత త్వరగా రోగులకు అందుబాటులోకి తెస్తామని చెబుతున్నారు అధికారులు. వాస్తవానికి ఈ పెట్ సిటీ స్కాన్ బయట ఆస్పత్రుల్లో చేయించాలంటే రూ.10వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది అని చెబుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

క్యాన్సర్ చికిత్సలో రేడియేషన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పెట్ సీటీ స్కాన్ ద్వారా క్యాన్సర్ కణం ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు. సీటీ స్కాన్‌లో ఎముకలు కనిపిస్తాయి.. ఎమ్మారైలో కణజాలం కనిపిస్తుంది. ఈ మూడింటినీ కలిపితే క్యాన్సర్ కణం ఎక్కడ ఉందో త్రీడీ చిత్రంలో చూడవచ్చు. వైద్యులు ఏ ప్రాంతానికి ఎంత రేడియేషన్ ఇవ్వాలో నిర్ణయిస్తారు. జీజీహెచ్‌లో సీటీ స్కాన్, ఎమ్మారై పరికరాలు ఉన్నాయి. పెట్ సీటీ స్కాన్ వినియోగానికి ఏఈఆర్‌బీ నిబంధనల ప్రకారం లైసెన్సు పొందాలి. దీని కోసం న్యూక్లియర్ మెడిసిన్ ఫిజీషియన్, టెక్నాలజిస్టులు అవసరం.

# క్యూ కడుతున్న కంపెనీలు.. భూముల ధరలకు రెక్కలు.!



ఏపీ: ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగ అభివృద్ధి కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. సాగరతీరం విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని చెప్తున్న ఏపీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుస్తు వస్తున్న సంస్థలకు భూకేటాయింపులు, ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రానికి వస్తున్న ఐటీ సంస్థలలో మెజారిటీ కంపెనీలు.. విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఇప్పటికే టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు సాగించేందుకు ఒప్పందాలు చేసుకోగా.. మరికొన్ని సంస్థలు కూడా అదే బాటలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలు కంపెనీలకు ప్రభుత్వం భూములు కేటాయిస్తోంది.

విశాఖపట్నంలో టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఐటీహిల్స్-3లో 22 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. విశాఖపట్నంలో టీసీఎస్ రూ.1370 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా సుమారుగా 12 వేల మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇక కాగ్నిజెంట్ సంస్థ రూ.1583 కోట్లు పెట్టుబడి పెట్టనుండగా.. 8 వేల మందికి ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు చెప్తున్నారు. కాగ్నిజెంట్ సంస్థకు మధురవాడలో 22.19 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది.

మరోవైపు విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్, క్లౌడ్ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు గూగుల్ ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో తర్లువాడలో గూగుల్ సంస్థకు 80 ఎకరాల భూమిని కేటాయించనున్నారు. ఇవే కాకుండా విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉర్సా, సిఫీ, ఫీనమ్ పీపుల్ వంటి సంస్థలు కూడా ముందుకు వచ్చాయి. మరోవైపు ఇప్పటికే 150 వరకూ సంస్థలు విశాఖ కేంద్రంగా పనిచేస్తున్నాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, మిరాకల్, డబ్ల్యూఎస్ఎస్ వంటి సంస్థలు ఇందులో ఉన్నాయి. సుమారుగా 30 వేల మంది వరకూ పనిచేస్తున్నారు. ఇప్పుడు కొత్త కంపెనీలు కూడా విశాఖ వైపు చూస్తున్న నేపథ్యంలో సాగర తీరం ఐటీ కేంద్రంగా మారనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు విశాఖపట్నం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో నాలుగు టౌన్‌షిప్?లు ఏర్పాటు చేయాలని వీఎంఆర్డీఏ భావిస్తోంది. నాలుగు ప్రాంతాలలో థీమ్ బేస్డ్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అలాగే విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టు ప్రక్రియ కూడా వేగవంతమైంది. ఆ రకంగా విశాఖలో మెరుగైన మౌలిక వసతుల కల్పన ద్వారా మరిన్ని కంపెనీలను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో.. మధురవాడ సహా విశాఖలో పలుచోట్ల భూముల ధరలు పెరుగుతున్నట్లు రియల్ ఎస్టేట్ వర్గాలు చెప్తున్నాయి.

# ప్రభుత్వ ఉపాధ్యాయులకు కొత్త రూల్.. ఇకపై అలా కుదరదు..

ఆంధ్రప్రదేశ్: ప్రభుత్వం టీచర్ల హాజరు విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. కొందరు టీచర్లు స్కూల్ ఎగ్గొట్టి సొంత పనులకు వెళ్తున్నారని ఫిర్యాదులు రావడంతో విద్యాశాఖ కొత్త విధానం తెచ్చింది. ఇకపై స్పెషల్ డ్యూటీకి వెళ్లాలంటే లీప్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి. డీడీవో అనుమతితోనే హాజరు వేస్తారు. లేదంటే శెలవు పెడతారు. దీనివల్ల టీచర్లు పాఠశాలలకు డుమ్మా కొట్టకుండా ఉంటారని ప్రభుత్వం భావిస్తోంది. కొంతమంది ఉపాధ్యాయులు తరచూ పాఠశాలలకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హాజరు వేసుకుని సొంత పనులకు వెళ్తున్నారట.. జిల్లా కార్యాలయానికి లేదా మండల వనరుల కేంద్రానికి వెళ్తున్నట్లు చెబుతున్నారట. లీప్ యాప్‌లో స్పెషల్ డ్యూటీ కింద రిజిస్టర్ చేసుకుంటున్నారట. పాఠశాలకు వెళ్లకుండా వేరే చోట హాజరు వేసి, సొంత పనులు చూసుకుంటున్నారట. దీనికి అడ్డుకట్ట వేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఉపాధ్యాయుల హాజరు విధానంలో మార్పులు చేసింది.

ఉపాధ్యాయులు స్కూల్ పని మీద బయటకు వెళ్లాలంటే ఇకపై లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) యాప్‌లో స్పెషల్ డ్యూటీకి దరఖాస్తు చేసుకోవాలి. కొత్త విధానం ద్వారా డీడీవో దరఖాస్తులను పరిశీలిస్తారు.. ఉపాధ్యాయులు ఎక్కడికి వెళ్లారో, ఆ ప్రాంతం అక్షాంశాలు, రేఖాంశాలతో సహా తెలుసుకుంటారు. ఆన్‌లైన్‌లో ఇచ్చిన వివరాలు, ఉపాధ్యాయుడు వెళ్లిన ప్రదేశం సరిపోలితే ఓటీపీ ద్వారా స్పెషల్ డ్యూటీకి అనుమతిస్తారు.. అప్పుడే హాజరు వేస్తారు.. లేదంటే గైర్హాజరు వేస్తారు. దీనివల్ల పాఠశాలలకు డుమ్మా కొట్టే ఉపాధ్యాయులకు అడ్డుకట్ట పడుతుంది. ఒకవేళ ఉపాధ్యాయుడు ప్రత్యేక పని మీద వెళితే కనుక.. వెంటనే సంబంధిత అధికారిని కలిసినట్లు డీడీవో ఫోన్ ద్వారా తెలుసుకుంటారు. ఉపాధ్యాయుల పని తీరు మెరుగుకు మంచి మార్పు తీసుకొచ్చేందుకు విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. డీడీవోకు ముందస్తు సమాచారంతో ప్రత్యేక విధులకు అనుమతి లభిస్తుంది. ఈ కొత్త విధానం వల్ల పాఠశాలల్లో బోధన కార్యక్రమాలు మరింత మెరుగుపడతాయని భావిస్తున్నారు.

# తిరుమలలో తమిళనాడు భక్తులకు ఊహించని షాక్!



తిరుమల: కారు అద్దాలు పగలగొట్టి చోరీ జరగడం భక్తుల్లో కలకలం రేపింది. వేలూరుకు చెందిన నిత్యవేలు కుటుంబంతో కలిసి వచ్చి నారాయణగిరి వద్ద కారు పార్క్ చేశారు. దర్శనం తర్వాత తిరిగి వచ్చేసరికి కారులో బ్యాగులు చిందరవందరగా ఉన్నాయి, రెండు జతల కమ్మలు మాయమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, గతంలో మహిళల మెడలో గొలుసులు దొంగిలించిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

తిరుమలలో చోరీ జరగడం కలకలం రేపింది. కొండపై పార్కింగ్‌లో ఉంచిన ఓ కారు అద్దాలను గుర్తుతెలియని దుండగులు పగులగొట్టి దొంగతనం చేశారు. తమిళనాడులోని వేలూరుకు చెందిన నిత్యవేలు బుధవారం రోజు తన కుటుంబంతో కలిసి తిరుమలకు వచ్చారు. వారు కారును నారాయణగిరి విశ్రాంతి భవనం ముందు ఉన్న పార్కింగ్‌లో పార్క్ చేశారు. తర్వాత శ్రీవారి దర్శనానికి వెళ్లారు.. గురువారం ఉదయం వారు కారు దగ్గరకు తిరిగి వచ్చారు. పార్కింగ్‌లో ఉంచిన కారు వెనుక అద్దాలు పగులగొట్టి.. సీట్లలో పెట్టిన బ్యాగులు కూడా చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని చూసి షాక్ అయ్యారు. కారు లోపల ఓ బ్యాగులో దాచిన రెండు జతల కమ్మలు కనిపించకుండా పోయాయి. వెంటనే వారు తిరుమల టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.. సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.. ఈ చోరీ ఘటన తిరుమలలో కలకలం రేపింది. నిత్యం భక్తులతో కనిపించే తిరుమలలో ఇలా చోరీ జరగడం కలకలం రేపింది.

రెండు వారాల క్రితం తిరుమలలో మహిళా భక్తుల్ని లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్న ఒక ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.

# తీరు మార్చుకోని కాంగ్రెస్ ప్రభుత్వం



ఎలుకతోలు తెచ్చి ఎన్నేళ్లు ఉతికినా. ..నలుపునలుపేగాని తెలుపు గాదయా అని సామెత. కాంగ్రెస్ పార్టీకి ఇది బాగా సరిపోతుంది. కెసిఆర్‌పై అసహనం, కెటిఆర్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించడం..కుటుంబ పాలనా పెత్తనం వంటివన్నీ సహించలేక బిఆర్ఎస్ పాలనపై విసుగుతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు తప్ప.. కాంగ్రెస్ హామీలపైనో లేదా రేవంత్‌పై ప్రేమతోనో లేదా..రాహుల్, సోనియాలపై భక్తితోనే ప్రజలు ఓట్లు వేయలేదు. అలాగే బిజెపి ఆడిన నాటకాలు కూడా ప్రజలు తిరస్కరించారు. బండి సంజయ్ రాకతో బిజెపి మంచి స్థితికి వచ్చింది. కానీ బిజెపి అధ్యక్షుడిగా సంజయ్‌ను తలగించడం, కెసిఆర్‌తో లోపాయకారి ఒప్పందం చేసుకోవడం వంటి కారణాలతో కూడా బిజెపికి దక్కాల్సిన అధికారం కాంగ్రెస్‌కు దక్కింది. ఇవన్నీ నిజాలు. కానీ కాంగ్రెస్ పార్టీ ఇవన్నీ మరచిపోయి పాలన సాగిస్తోంది. బిఆర్ఎస్ పాపాలను విమర్శిస్తున్న వీరు తాము కూడా అదేపనిలో ఉన్నారు. పైరవీలు, పర్సెంటేజీలు, బెదరింపులు వంటి వ్యవహారాలపై బలంగా ప్రచారం సాగుతోంది. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు ఒక్కటంటే ఒక్కటి తీసుకోవడం లేదు. ఆరు గ్యారెంటీలు, అప్పులు తప్ప చేసిన నిర్ణయాత్మక కార్యక్రమాలు లేవు. మంత్రుల్లో అనైక్యత కారణంగా పనులు సాగడం లేదు. గుంటల రోడ్లను కూడా పూడ్చలేని అసమర్థత కనిపిస్తోంది. కాంగ్రెస్ రాజకీయాలు గతంలో కూడా ఇలాగే ఉండేవి. అందుకే ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారు. ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారం చేపట్టాక కాంగ్రెస్ మార్కు రాజకీయాలను ప్రజలు మరచిపోయేలా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004లో ముఖ్యమంత్రి అయిన రాజశేఖరరెడ్డి పార్టీ పైన, ప్రభుత్వంపైన పూర్తి పట్టు సాధించారు. దీంతో కాంగ్రెస్‌లో అసంతృప్త స్వరాలు, పాత జమానా తాలూకు వ్యవహారాలు కనపించకుండా పోయాయి. ప్రభుత్వంపై వైఎస్ తనదైన ముద్ర వేశారు. రాజశేఖరరెడ్డి కూడా కాంగ్రెస్‌ను ప్రాంతీయ పార్టీ స్థాయిలోనే నడిపారు. ఏక వ్యక్తి పాలనకు, ప్రాంతీయ పార్టీల కల్చర్‌కు అలవాటుపడిన తెలుగు ప్రజలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు జీర్ణించుకోవడం లేదు. ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో దశా దిశా లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోంది. క్షేత్రస్థాయిలో పనులు కావడం లేదని సొంత పార్టీ ఎమ్మెల్యేలే గట్టిగా స్వరం వినిపిస్తున్నారు. మరోవైపు నిధుల కొరత కారణంగా చిన్న చిన్న పనులు కూడా మంజూరు చేయించలేని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ పరిణామాలతో వారిలో అసంతృప్తి చోటుచేసుకుంటోంది. ప్రభుత్వంలోనే కాదు, పార్టీలోనూ సిఎం రేవంత్‌రెడ్డికి పట్టు లేదన్న అభిప్రాయం బలపడుతోంది. ఎన్నికలకు ముందు రేవంత్ మాటతీరు, హామీల తీరు చూసి రేవంత్ రెడ్డి కూడా అలాగే వ్యవహరిస్తారనీ, కొత్తగా సంచలన నిర్ణయాలతో ముందుకు సాగాలని ఆశించారు. అయితే, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సురేఖ దంపతులపై ప్రజల్లో ముందునుంచీ సదభిప్రాయం లేదు. తాజా వ్యవహారంలో ఆమెపై చర్యలు తప్పవని అంతా భావించారు. ఆమె కుమార్తె అన్న మాటలకు సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి ఉండాలి. అయితే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవ తీసుకొని కొండా సురేఖను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లారు. దీంతో ఆయన అప్పటికి శాంతించారు. నిజంగానే చర్యలు తీసుకుని ఉంటే కాంగ్రెస్ ఇమేజ్ పెరిగేది. సురేఖ దంపతులతో రేవంత్‌రెడ్డి రాజీ కుదుర్చు కున్నారన్న అభిప్రాయం ప్రజల్లో అసంతృప్తిని కలిగించింది. మరో వైపు మంత్రులు ఎవరికి వారు సర్వ స్వతంత్రులుగా వ్యవహరిస్తున్నారు. ఆ శాఖ, ఈ శాఖ అని లేకుండా అన్ని శాఖల్లో జోక్యం చేసుకుంటు న్నారని అంటున్నారు. ఎవరికి వారు ముఖ్యమంత్రులుగా భావించి వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రిని ప్రైవేట్ సందర్భాల్లో విమర్శిస్తున్న వారు కూడా ఉన్నారు. దీనికితోడు ప్రభుత్వంలో వివిధ స్థాయిలలో అవినీతి పెరిగిపోయింది. గ్రామపంచాయితీ లెవల్లో వేయి చేతిలో పెట్టనిదే ఏ పనీ జరగడం లేదు. ఎసిబి దాడులు చేస్తున్నా పిసరంత ప్రభావం కూడా కనిపించడం లేదు. ఉద్యోగుల అవినీతిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. కానీ అలా జరగడం లేదు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులపై పట్టు లేదన్న వాదన బలపడింది. ఇకపోతే గందరగోళ నిర్ణయాలకు తోడు, అదేపనిగా గత బిఆర్ఎస్‌పై విమర్శలు చేస్తూ సాగుతున్నారు. దానిబదులు ఏదైనా అవినీతిపై గట్టి చర్య తీసుకుని ఉంటే ప్రభుత్వ ఇమేజ్ పెరగి ఉండేది. అలా కాకుండా కాంగ్రెస్ అధిష్టానానికి సంచులు మోస్తున్నారన్న ప్రచారం గ్రమస్థాయిలో నాటుకు పోచింది. ఇక ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కూడా బెడిసి కొడుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలన్న నిర్ణయం విషయంలో అపరిపక్వత బయటపడింది. ప్రజల్లో చులకన అయ్యారు. ముందూ వెనుకా ఆలోచించకుండా, చట్టపరమైన సమస్యలను అధ్యయనం చేయకుండా నిర్ణయం తీసుకోవడంతో ప్రభుత్వం అభాసుపాలయ్యింది. 42 శాతం రిజర్వేషన్లు ఇప్పించే బాధ్యత బిజెపిదేనంటూ దానిపై నెపాన్ని మోపడం కూడా చేతకానితనాన్ని రుజువు చేసింది. 42శాతం హామీ ఇచ్చింది కాంగ్రెస్ అయితే దానికి బిజెపిని బద్నాం చేయడం కూడా ప్రజలకు రుచించడం లేదు. పర్యవసానాలు ఆలోచించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకుంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు అమలులో ఉన్నందున ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టులు కొట్టిపారేశాయి. దీంతో బీసీల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. రిజర్వేషన్లు పెంచడానికి అసెంబ్లీలో మద్దతు ప్రకటించిన రాజకీయ పార్టీలు ఇప్పుడు బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వంపైకి నెట్టి తప్పుకొంటున్నాయి. ఫలితంగా ఈ సమస్య పరిష్కార బాధ్యత ప్రభుత్వంపై పడింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధిస్తే కొంత ఇమేజ్ పెరుగుతుంది. లేదంటే అతఃపాతాళానికి పతనం తప్పదు. బిసికి టిక్కెట్ ఇచ్చి ప్రచారం చేస్తున్నా.. ఫలితం అందుకు విరుద్ధంగా ఉంటే మాత్రం ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మరింత పెరుగుతుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకుని బాధ్యతగా ముందుకు నడిపించాల్సిన ర ఆహుల్ సొంత రాజకీయాలతో మునిగి పోయారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలను చూసీచూడ నట్లుగా పోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ పుట్టి మునగడం ఖాయం. ఎందుకంటే కాంగ్రెస్ పాలనాతీరు చూస్తున్న ప్రజలు కెసిఆర్ నయం అన్న భావనకు వస్తున్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ మారకుంటే కాంగ్రెస్ పార్టీ మళ్లీ తెలంగాణలో ఇక అధికారంలోకి రావడం కల్ల.

## ఢిల్లీలో రోజురోజుకూ క్షీణిస్తున్న గాలి నాణ్యత

**తీవ్రమైన వాయుకాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు**

**ఆస్పత్రుల్లో పెరుగుతున్న శ్వాసకోస కేసులు**



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయిలో నమోదవుతోంది. సోమవారం ఉదయం ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచిక 315గా నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. అశోక్ విహార్‌లో అత్యధికంగా ఏక్యూఐ 416గా నమోదైంది. ఆ తర్వాత గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. గణెశ్‌పూర్ వద్ద 318, జీటీబీ నగర్‌లో 302, కశ్మీర్ గేట్ ఐఎస్‌బీటీ ప్రాంతంలో 298, యమూర్ విహార్‌లో 287గా ఏక్యూఐ నమోదైంది. రాత్రికి ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఢిల్లీ ఆర్ఎమ్‌సీ అంచనా వేసింది. తీవ్రమైన వాయుకాలుష్యంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లోని ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. శ్వాసకోశ, ఛాతీలో నొప్పి, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలతో స్థానికులు ఆసుపత్రులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించ వచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, ఒఖిఎ 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, ఒఖిఎ 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, ఒఖిఎ 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 29న ఢిల్లీలో మొదటిసారిగా కృత్రిమ వర్షాన్ని కురిపించేందుకు ఏర్పాట్లు చేశామని సీఎం రేఖా గుప్తా వెల్లడించారు. బురాయ్‌లో ప్రయోగాత్మక పరీక్ష విజయవంతమైందన్నారు. ఐఐటీ-కాన్పూర్ సహకారంతో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌కు ఐఎండీ, ఐఐటీఎమ్-పుణె తోడ్పాటును అందిస్తున్నాయి. దీపావళి తర్వాత పొగ మంచు సీజన్‌లో కాలుష్య కణాలను తగ్గించడానికి వాయువ్య ఢిల్లీలో అయిదు చోట్ల ఈ కృత్రిమ వర్షం కురిపించనున్నారు. ఇందుకోసం డీజీసీపీ అనుమతి పొందారు.

సిల్వర్ అయోడైడ్ లేదా సోడియం క్లోరైడ్ లాంటి పదార్థాలను మేఘాల్లోకి విడుదల చేయడం ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపిస్తారు. ఈ వర్షం కారణంగా రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది.

## దిగివస్తున్న బంగారం ధరలు

**రూ. 1140 మేర తగ్గుదల నమోదు**



హైదరాబాద్: ఊహించినట్టుగానే సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే బంగారం ధరలు మరింతగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లల్లో పసిడి ధరల తగ్గుదల, అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, డాలర్ బలపడుతుండటం వెరసి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో నేడు ట్రేడింగ్ మొదట్లో పసిడి ధరలు తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర గతంతో పోలిస్తే రూ. 1140 మేర తగ్గి రూ. 1,24,480కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1050 మేర తగ్గి రూ.1,14,100 వద్ద తచ్చాడుతోంది. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి అంతర్జాతీయ మార్కెట్‌లల్లో కూడా పసిడి ధరలు తిరోగమనంలో పయనిస్తున్నాయి. ఔన్స్ బంగారం (24 క్యారెట్) స్పాట్ ధర రూ.0.7 శాతం మేర క్షీణించి 4,082.77 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర కూడా 1 శాతం మేర తగ్గి 4,095.80 డాలర్ల వద్ద కొనసాగుతోంది. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి ధరలు మరింత తగ్గే ఛాన్సుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.అమెరికా, చైనా మధ్య సానుకూల వాతావరణంలో వాణిజ్య చర్చలు జరుగుతుండటంతో సురక్షిత పెట్టుబడి సాధనాలైన పసిడి, వెండికి డిమాండ్ తగ్గుతోందని నిపుణులు చెబుతున్నారు. ప్రామాణిక వడ్డీ రేట్ల కోత విషయంలో ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు తీసుకునే నిర్ణయం గురించి మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం కాస్త నెమ్మదించంతో

కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్.. వడ్డీ రేట్లల్లో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశం ఉంది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ జపాన్ మాత్రం వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంది.

## డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీం ఆందోళన

**ప్రణాళిక రూపొందించాలని సిబిఐకి ఆదేశం**



న్యూఢిల్లీ: డిజిటల్ అరెస్టులపై సిబిఐ దర్యాప్తుల జరగాల్సి ఉందన్న అభిప్రాయాన్ని సుప్రీం పేర్కొంది. వరుసగా జరుగుతోన్న సైబర్ నేరాల కారణంగా పలువురు ఆర్థికంగా దోపిడీకి గురవుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ కేసుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఇటీవల వచ్చిన ఓ కేసును సుమోటాగా తీసుకొని విచారణ జరుపుతోంది ఈ నేరాలపై సీబీఐ దర్యాప్తును పర్యవేక్షిస్తానని పేర్కొంది. డిజిటల్ అరెస్టు కారణంగా తాను రూ.కోటి కోల్పోయానని హరియాణాకు చెందిన ఓ వృద్ధ మహిళ వేసిన కేసు నేపథ్యంలో ఈ విచారణ జరుగుతోంది. ఈ సందర్భంగా సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. మయన్మార్, థాయ్‌లాండ్ వంటి ఆఫ్‌షోర్ లొకేషన్ల నుంచి ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయని, ఈ కేసుల దర్యాప్తునకు ఒక ప్రణాళికను రూపొందించాలని సీబీఐను ఆదేశించింది. కేంద్ర ఏజెన్సీ దర్యాప్తులో పురోగతిని పరిశీలిస్తామని, దానిని బట్టి అవసరమైన ఆదేశాలను జారీ చేస్తామని పేర్కొంది.

అలాగే డిజిటల్ అరెస్టు కేసులకు సంబంధించి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్ వివరాలను సమర్పించాలని ఆయా ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది.

## కార్తీక సోమవారంతో శైవాలయాల్లో భక్తుల రద్దీ

**వేకువ జామునే పుణ్యస్నానాలతో ఆలయాలకు చేరిక**

**పాదగయ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు**



కాకినాడ:కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రాల్లో భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచే పరమేశ్వరుడికి అభిషేకాలు జరిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. తెల్లవారుజాము నుండి పాదగయ పుష్కరినిలో పవిత్ర స్నానమాచరించి.. కార్తీక దీపాలు వెలిగిస్తూ.. ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పాదగయ క్షేత్రంలో కార్తీక మాస మొదటి సోమవార వైభవం.. పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలోని పాదగయ క్షేత్రం, త్రిగయా క్షేత్రాల్లో ముఖ్యమైనదిగా ప్రసిద్ధి చెందిన పవిత్ర స్థలం. ఇక్కడి శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి ఆలయం, శ్రీ పురుహూతికా దేవి శక్తిపీఠంతో కలిసి ఉన్న ఈ పుణ్యక్షేత్రాన్ని అత్యంత పవిత్రమైన ప్రాంతంగా స్థానిక భక్తజనం నమ్ముతారు. ఈ ఆలయం శ్రీ గురు దత్తాత్రేయ స్వామి ప్రథమ అవతారమైన శ్రీపాద శ్రీవల్లభ మహారాజు జన్మభూమిగా కూడా ప్రసిద్ధి. పురాణాల ప్రకారం, గయాసురుడి యజ్ఞాన్ని కుక్కుట (కోడి) రూపంలో భంగం చేసిన శివుడు ఇక్కడ కుక్కుటేశ్వరుడిగా స్థిరపడ్డారని ప్రతీతి. తెల్లని లింగస్వరూపంలో దర్శనమిచ్చే స్వామివారు, పితృముక్తి కోసం భక్తులకు మొదటి గయాగా ప్రసిద్ధి చెందారు. కార్తీక మాసం మొదటి సోమవారంసందర్భంగా, ఈ పవిత్ర క్షేత్రం భక్తులతో అలరారుతోంది. తెల్లవారుజాము నుండే పాదగయ పుష్కరిణిలో పవిత్ర స్నానం చేసిన భక్తజనం, కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు అర్పిస్తున్నారు. ఈ కార్తీక మాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైనదని పురాణాలు చెబుతున్నాయి. సూర్యోదయానికి ముందు నిద్రలేచి,

నదీ స్నానం చేసి, మహామృత్యుంజయ మంత్రాలు జపించడం, ఆవునేతి లేదా నువ్వుల నూనెతో దీపారాధన చేయడం వంటి ఈ నియమాలు పాటించినవారు పుణ్యఫలం పొందుతారని పండితులు చెబుతున్నారు. పాదగయ పుష్కరిణి ప్రాంతంలో ఇప్పుడు దేవదీపాల జ్యోతి, 'హర మహాదేవ' గానాలు, భక్తుల భక్తిభావనలు కలిసి ఒక దైవిక వాతావరణం కనిపిస్తోంది.



## నాకు మంచి ఫ్రెండ్ మాత్రమే..

ధనుష్‌తో తనకు ఎలాంటి ప్రేమ సంబంధం లేదని నటి మృణాల్ ఠాకూర్ స్పష్టం చేసింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడేనని, ఈ రూమర్స్ గురించి తెలుసునని కానీ పట్టించుకోలేదని తెలిపింది. 'సన్నాఫ్ సర్దార్ 2' ఈవెంట్‌కు ధనుష్ అజయ్ దేవగణ్ కోసమే వచ్చాడని, వారిద్దరూ మంచి ఫ్రెండ్స్ అని చెప్పింది. ఇద్దరం కలిసి కనిపించామన్న కారణంతో ఏదో ఉందని ఊహించుకోవద్దని స్పష్టం చేసింది. దీంతో ఇద్దరి మధ్య రిలేషన్ రూమర్స్‌కు చెక్ పడినట్లైంది.

ధనుష్‌తో మృణాల్ ఠాకూర్ ప్రేమాయణం.. కొద్దిరోజులుగా వైరల్ అవుతోన్న వార్త ఇది. ఈ జంట ఇటీవల పార్టీల్లో కలిసి కనిపిస్తుండటంత, మృణాల్ బర్త్‌డే పార్టీలో ధనుష్ సందడి చేయడంతో కోలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు వీరి గురించి ఏవేవో వార్తలొస్తున్నారు. సాధారణంగా హీరో హీరోయిన్లు తమతో కలిసి నటించిన వాళ్లతో కాస్త క్లోజ్‌గా కనిపిస్తుండటం సహజమే. కానీ ధనుష్, మృణాల్ ఇప్పటివరకు ఒక్క సినిమాలో కూడా కలిసి నటించకపోయినా ఇంత క్లోజ్‌గా ఉండటం అనుమానాలకు తావిస్తోంది. రజినీకాంత్ కుమార్తె ఐశ్వర్యతో 18 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలికిన ధనుష్.. కొంతకాలంగా సింగిల్‌గా ఉంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నటి మీనాని ఆయన రెండో వివాహం చేసుకోబోతున్నారంటూ వార్తలొచ్చినా అవన్నీ ఫేక్ అని తేలిపోయింది. తాజాగా ఆయన మృణాల్‌తో క్లోజ్‌గా ఉండటంతో డేటింగ్ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ ప్రచారంపై మృణాల్ ఠాకూర్ స్పందించింది. ధనుష్‌తో తనకెలాంటి సంబంధం లేదని, ఆయన జస్ట్ ఫ్రెండ్ మాత్రమేనని చెప్పుకొచ్చింది. 'ధనుష్ నాకు స్నేహితుడు మాత్రమే. అంతకుమించి మా మధ్య ఎలాంటి సంబంధం లేదు. ఈ రూమర్స్ గురించి నాకు ముందే తెలుసినా నేను పట్టించుకోలేదు. 'సన్నాఫ్ సర్దార్ 2' ఈవెంట్ కు ధనుష్ వచ్చింది నాకోసం కాదు.. అజయ్ దేవగణ్ కోసం. ధనుష్ హిందీ చిత్రాల్లోనూ నటించడంతో బాలీవుడ్ స్టార్లతో ఆయనకు ఫ్రెండ్‌షిప్ ఉంది. అందుకే అజయ్ దేవ్‌గణ్ ఆహ్వానం మేరకు ధనుష్ వచ్చారు. అక్కడ ఎదురుగా ఉన్నందువల్లనే నేను ఆయన్ని పలకరించాను. అంతమాత్రాన మా ఇద్దరికి సంబంధం అంటగట్టడం చాలా దారుణం. మా మధ్య అలాంటి రిలేషన్ ఏదీ లేదు. దయచేసి రూమర్స్ క్రియేట్ చేయకండి' అని చెప్పుకొచ్చింది మృణాల్. ఈ బ్యూటీ స్టేట్‌మెంట్‌తో డేటింగ్ రూమర్స్‌కి ఇకపైనా చెక్ పడుతుందో లేదో చూడాలి. ఇటీవల మృణాల్ ఠాకూర్ పుట్టినరోజు వేడుకల్లోనూ ధనుష్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ కనిపించాడు. ఆమెతో సన్నిహితంగా మెలగడం, చేతులు పట్టుకోవడం.. ఇద్దరూ లవర్స్‌లా కనిపించడంతో వీరిద్దరి మధ్య డేటింగ్ వార్తలకు ఆజ్యం పోసినట్లయింది. అంతేకాకుండా అసలు తనకు సంబంధమే లేని పార్టీకి ధనుష్ కోసం మృణాల్ వెళ్లినట్లు బాలీవుడ్ కోడై కూస్తోంది. దీంతో వీరి మధ్య ప్రేమాయణం కొనసాగుతోందని, త్వరలోనే దీనిపై ఎవరో ఒకరు ఓపెన్ కావొచ్చని అంతా అనుకున్నారు. అయితే ఈ రూమర్స్‌ని మృణాల్ ముందు పెద్దగా పట్టించుకోలేదట. దీంతో సోషల్‌మీడియాలో మరింత మసాలా యాడ్ చేసి వార్తలు వైరల్ చేస్తుండటంతో ఆమెకు స్పందిచక తప్పలేదు. ధనుష్‌తో తనకున్నది కేవలం స్నేహం మాత్రమేనని ఆమె చెప్పడంతో ఈ ప్రచారానికి ఇక తెరపడినట్లేనని అనుకోవచ్చు. దీనిపై ధనుష్ కూడా స్పందించాలని నెటిజన్లు కోరుతున్నారు.

## పేరు మార్చుకున్న విశ్వక్ సేన్..



టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్‌సేన్ అసలు పేరు దినేష్ నాయుడు. కానీ సినీ ప్రపంచంలో అందరికీ విశ్వక్‌సేన్‌గానే సుపరిచితం. తాజాగా ఆయన పేరు మార్పుపై చర్చ మొదలైంది. ఇంతకాలం వికీపీడియాలో 'విశ్వక్‌సేన్'గా ఉన్న పేరు, ఇప్పుడు 'విశ్వక్‌సేన్ నాయుడు'గా మారింది. దీన్ని గమనించిన నెటిజన్లు, దినేష్ నాయుడు తన పేరును అధికారికంగా విశ్వక్‌సేన్ నాయుడుగా మార్చుకున్నాడని కామెంట్ చేస్తున్నారు. ఇటీవల ఆయనకు హిట్ పడకపోవడంతో, లక్ కోసం సెంటిమెంట్‌గా ఈ మార్పు చేసి ఉండవచ్చని ఊహిస్తున్నారు. సినీ ఇండస్ట్రీలో అన్ని రంగాల్లో ప్రతిభ చూపించేవాళ్లు అరుదుగా ఉంటారు. అలాంటివారిలో ఒకడు విశ్వక్ సేన్.

హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన విశ్వక్‌సేన్ 2017లో 'వెళ్లిపోమాకే' చిత్రం ద్వారా హీరోగా ఇండస్ట్రీకి పరిచయమయ్యాడు. ఫస్ట్ మూవీతోనే సైమా అవార్డు అందుకున్నాడు. 'ఈ నగరానికి ఏమైంది' మూవీతో విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు. దాని తర్వాత 'ఫలక్‌నుమా దాస్'తో హీరోగానే కాకుండా డైరెక్టర్, రైటర్, కో ప్రొడ్యూసర్‌గానూ మారాడు. హిట్, పాగల్, అశోకవనంలో అర్జున కళ్యాణం, ఓరి దేవుడా, దాస్ కా ధమ్కీ, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, మెకానిక్ రాకీ, లైలా చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరిస్తూ వస్తున్నాడు. విశ్వక్‌సేన్ అసలు పేరు దినేష్ నాయుడు . అయితే అందరికీ మాత్రం విశ్వక్‌సేన్‌గా మాత్రమే తెలుసు. తాజాగా తను పేరు మార్చుకున్నట్లుగా తెలుస్తోంది. ఎందుకంటే ఇన్నాళ్లూ వికీపీడియాలో విశ్వక్‌సేన్ అని పేరు కనిపించేది. తాజాగా విశ్వక్‌సేన్ నాయుడు అని కనిపిస్తోంది. దీన్ని గమనించిన నెటిజన్లు దినేష్ నాయడు పేరును విశ్వక్‌సేన్ నాయుడుగా మార్చుకున్నాడని కామెంట్లు పెడుతున్నారు. విశ్వక్‌సేన్‌కి ఇటీవల పెద్దగా ఏదీ కలిసిరావడం లేదు. తను హిట్ అందుకుని చాలా రోజులే అయింది. దీంతో లక్ కలిసి వచ్చేందుకు సెంటిమెంటుగా పేరు మార్చుకుని ఉండొచ్చని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

## ఎమ్మెల్యే వాహనంలో నిర్మాత నాగవంశీ..



టాలీవుడ్ నిర్మాత నాగవంశీ తరచుగా ఏదో ఒక విషయంలో సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూనే ఉంటారు. ఆయన ఇంటర్వ్యూలు, ప్రెస్ మీట్‌లు, ఈవెంట్ స్పీచ్‌లు ఇలా ఎప్పుడు కనిపించినా సోషల్ మీడియాలో వైరల్ అవుతారు. తాజాగా నాగవంశీకి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో తిరుగుతుంది. ఇందులో ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న ఓ వాహనంలో నాగవంశీ ఉన్నారు. ఈ వీడియోని ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రోల్ అవుతుంది. దీనిపై పూర్తి వివరాలు ఇదిగో.

హీరోయిన్ నిధి అగర్వాల్ ఈ మధ్య ఓ వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఇటీవల భీమవరంలో ఒక షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి నిధి వెళ్లింది. అయితే అక్కడికి ఆమె ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనంలో రావడం వివాదానికి దారి తీసింది. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవడంతో వైసీపీ సహా నెటిజన్లు చాలా మంది ఈ వీడియోని తప్పుపడుతూ ట్రోల్ చేశారు. ఇది మరువకముందే ఇలాంటి వీడియోనే మరొకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

నిర్మాత నాగవంశీ 'ఎమ్మెల్యే' స్టిక్కర్ వాహనంలో ప్రయాణిస్తున్న వీడియో ఒకటి వైరల్ అవుతుంది. ఆయన సదరు కారులో కూర్చొని ఎవరితోనే మాట్లాడుతున్నారు. ఇక ఈ వాహనం నంబర్ ప్లేట్ చూస్తే TG09F 1111' అని ఉంది. నిధి అగర్వాల్ ఘటన మరవకముందే ఇలా ఈ వీడియో కూడా రావడంతో వైసీపీ అభిమానులు, నేతలు సోషల్ మీడియా లో ఏకేస్తున్నారు. అయితే నాగవంశీ ఎక్కిన ఈ వాహనం ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి చెందిన కారుగా సమాచారం.

## రెమ్యూనరేషన్‌తో కొనలేమన్న గురూజీ





ఆర్.నారాయణమూర్తి .. ఈ పేరు వింటే చాలు విప్లవ భావాలు కలిగిన ఉత్తేజం ఉరకలెత్తుతుంది. ఎన్టీఆర్ కాలంలో జూనియర్ ఆర్టిస్టుగా ప్రయాణం ప్రారంభించిన ఆయన.. ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారి అక్కడి నుంచి హీరోగా, నిర్మాతగా ఎన్నో మంచి చిత్రాలు అందించారు. స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్‌పై ఇప్పటివరకు 30కి పైగా చిత్రాలు తెరకెక్కించారు. అందులో అడవి బిడ్డలు, ఎర్ర సముద్రం, ఎర్ర సైన్యం. చీమలదండు, వీర తెలంగాణ, పీపుల్స్ వార్, నిర్భయ భారతం వంటి చిత్రాలు ఆయనకు ఎంతో పేరు తీసుకొచ్చాయి. ప్రజా సమస్యలపై గళమెత్తుతూ సినిమాలు తీసే ఆయన్ని 'పీపుల్స్ స్టార్' అని పిలుస్తారు. తాజాగా ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'యూనివర్సిటీ పేపర్ లీక్' చిత్రం ఆగస్టు 22 న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా.. ప్రముఖ సినీ రచయిత, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్. నారాయణమూర్తి గురించి త్రివిక్రమ్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

'సినీ పరిశ్రమలో రెమ్యునరేషన్‌తో ఆర్.నారాయణమూర్తిని ఎవరూ కొనలేరు. ఇండస్ట్రీలో ఆయన ప్రయాణం సుదీర్ఘమైనది. ఆయన వన్ మ్యాన్ ఆర్మీ. తన సినిమాల్లో రాజు ఆయనే, సైనికుడూ ఆయనే. కథాలోచన నుంచి సినిమాని ప్రేక్షకుడి వద్దకు తీసుకెళ్లే వరకూ ఆయనొక్కరే ప్రయత్నిస్తారు. ప్రజలకు ఏదొక ప్రయోజనం చేరాలి అన్న ఉద్దేశంతోనే సినిమాలు చేస్తారు. అణచివేతని ధైర్యంగా ఎదుర్కొనే వ్యక్తి. 'యూనివర్సిటీ పేపర్ లీక్' సినిమా చూస్తుంటే వేరే ప్రపంచంలో ఉన్నామా అనిపిస్తోంది.

ఈ మూవీ కోసం ఆయన చాలా నిజాయతీగా కష్టపడ్డారు. ఆయన శ్రమకు తగిన ప్రతిఫలం కచ్చితంగా దక్కుతుంది. సినీ ఇండస్ట్రీలో రాజీపడకుండా ఎవరూ బతకలేరు. నేను కూడా చాలాసార్లు రాజీపడ్డా. కానీ ఆర్.నారాయణమూర్తి మాత్రం అస్సలు రాజీపడరు. నా సినిమాలో ఓ పాత్రకు నారాయణమూర్తిని తీసుకోవాలనుకున్నాను. కానీ రెమ్యునరేషన్‌తో ఆయన్ని కొనలేమని అర్థమైంది. ఆయనొక శక్తి' అని త్రివిక్రమ్ కొనియాడారు.

అంతకుముందు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ..

నాకు, త్రివిక్రమ్‌కి మధ్య ఎలాంటి ఆబ్లిగేషన్స్ లేవు. నా పట్ల, సినిమాల పట్ల ఆయనకు అభిమానం ఉంది. అందుకే 'యూనివర్శిటీ' సినిమా చూసి దాన్ని ప్రేక్షకులకు చేరువయ్యేలా చేయాలని కోరిన వెంటనే సరేనన్నారు. నా ఆహ్వానాన్ని మన్నించి సినిమా చూడటానికి వచ్చినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అన్నారు.



## సెట్స్‌లో మా అమ్మను చూసి నాన్న స్టెప్పులు మర్చిపోయారు

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహించిన ఈ హారర్ థ్రిల్లర్ ను షైన్ స్క్రీన్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మించారు. ఇప్పటికే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. శుక్రవారం(సెప్టెంబర్ 12) ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ప్రచారంలో చివరి అంకమైన ప్రీ రిలీజ్ ఈవెంట్ ను బుధవారం సాయంత్రం హైదరాబాద్ లో నిర్వహించారు. దీనికి దర్శకులు అనిల్ రావిపూడి, బుచ్చిబాబు, చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా తన తండ్రి చిరంజీవికి అమ్మ సురేఖ అంటే కాస్త భయమని సుస్మిత నవ్వుతూ చెప్పింది. దీనికి ఉదాహరణగా ఓ సరదా ఇన్సిడెంట్ ను పంచుకున్నారు. "మన శంకర వరప్రసాద్ గారు' సెట్స్ లో ఇవాళ ఓ చిన్న విషయం జరిగింది. ప్రస్తుతం ఓ సాంగ్ షూటింగ్ జరుగుతోంది. మా అమ్మ స్పెషల్ గా షూట్ కి వచ్చారు. అప్పటిదాకా నాన్న చాలా బాగా డ్యాన్స్ చేస్తున్నారు. సడన్ గా ఆమె వచ్చి ఎదురుగా కూర్చోవడం వల్ల డ్యాన్స్ కొంచం అటు ఇటు అవ్వడం, స్టెప్పులు మర్చిపోవడం వంటివి జరిగాయి. ఆయనపై అమ్మ ఎఫెక్ట్ పడిందని అనుకుంటున్నాను" అని సరదాగా చెప్పారు. దీంతో ఎంత మెగాస్టార్ అయినా భార్య అంటే భయపడాల్సిందే అంటూ ఫ్యాన్స్ ఫన్నీ కామెంట్స్ చేశారు. (భారీ రేటుకి 'అఖండ 2' ఓటీటీ రైట్స్.. బాలయ్య క్రేజ్ నెక్ట్స్ లెవల్ అంతే..)తన మోస్ట్ ఫేవరెట్ జానర్ హారర్ థ్రిల్లర్ అని, 'కిష్కింధపురి' తప్పకుండా విజయం సాధించాలని సుస్మిత కోరుకున్నారు. "ట్రైలర్ మైండ్ బ్లోయింగ్ గా, ఫెంటాస్టిక్ గా ఉంది. డైరెక్టర్ కౌశిక్ ఇంటెన్స్ విజువల్స్ చూపించారు. హ్యూమర్ టచ్ ఇస్తూ చాలా ఇంట్రెస్టింగ్ ప్రజెంట్ చేశారు. కిష్కింధపురి అనే టైటిల్ తోనే అందర్నీ ఒక సూపర్ నాచురల్ వరల్డ్ లోకి ఈజీగా తీసుకెళ్ళిపోయారు. సాయి శ్రీనివాస్, అనుపమ బెస్ట్ పర్ఫార్మన్స్ ఇచ్చారు. అనుపమ చాలా మందిని భయపెట్టింది.

## మనుషులు ఇంత క్రూరంగా ఉంటారా?



సినీ కెరీర్‌లో వరుస విజయాలు సాధిస్తున్నస్టార్ హీరోయిన్ రష్మిక మందానా వ్యక్తిగతంగా సోషల్ మీడియా ట్రోలింగ్ కారణంగా కష్టాలు ఎదుర్కొంటోందని తెలిపింది. తన ఎదుగుదలను అడ్డుకునేందుకు కొందరు డబ్బులిచ్చి మరీ తనపై ట్రోలింగ్ చేయిస్తున్నారని ఆరోపించింది. తాజా వ్యాఖ్యలతో రష్మికకు నెటిజన్లు మద్దతుగా నిలుస్తున్నారు.

వరుస బ్లాక్‌బస్టర్లతో పాన్ ఇండియా హీరోయిన్‌గా దూసుకుపోతోంది కన్నడ బ్యూటీ రష్మిక మందానా . నేషనల్ క్రష్‌గా కుర్రాళ్ల మనసులు దోచిన ఈ చిన్నది ఇప్పుడు ఏ సినిమా చేసినా హిట్టే అన్నట్లుగా హవా సాగిస్తోంది. 2016లో 'కిరిక్ పార్టీ' అనే కన్నడ చిత్రం ద్వారా హీరోయిన్‌గా మారిన రష్మిక.. 2018లో 'ఛలో' మూవీతో టాలీవుడ్ లో అరంగ్రేటం చేసింది. అదే ఏడాది 'గీత గోవిందం'తో ఆమె మంచి బ్రేక్ వచ్చింది. అక్కడ నుంచి వెనుదిరిగి చూసుకోకుండా టాలీవుడ్ నుంచి కోలీవుడ్ మీదుగా బాలీవుడ్ వరకు తన సత్తా చూపిస్తోంది. యానిమల్, పుష్ప 2, ఛావా చిత్రాలు బ్లాక్‌బస్టర్ సాధించడంతో ఆమె రేంజ్ తారాస్థాయికి చేరింది. ఇటీవలే 'కుబేర'తో మంచి హిట్ అందుకున్న రష్మిక ప్రస్తుతం రాహుల్ రవీంద్రన్ డైరెక్షన్లో 'గర్ల్‌ఫ్రెండ్', హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లె డైరెక్షన్లో లేడీ ఓరియెంటెడ్ మూవీ 'మైసా', విజయ్ దేవర కొండ సరసన మరో చిత్రంలోనూ నటిస్తోంది.

అయితే కెరీర్‌లో అద్భుతమైన విజయాలు అందుకుంటూ ప్రస్తుతం చేతి నిండా సినిమాలున్నా రష్మిక మాత్రం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఆమె ఈవెంట్లు, ఇంటర్వ్యూల్లో ఏం మాట్లాడినా క్షణాల్లో ట్రోలింగ్ మొదలైపోతోంది. కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లుగా కొందరు రష్మిక ఏం మాట్లాడినా అందులో తప్పులు వెతుకుతూ దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆమె సొంత రాష్ట్రమైన కర్ణాటక నుంచే ఎక్కువగా ట్రోలింగ్ ఎదుర్కొంటూ ఉంటుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. కొడవ కమ్యూనిటీ నుంచి వచ్చిన తొలి నటిని తానేనని చెప్పుకోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. దీంతో సొంత వర్గం నుంచి ఆమె ట్రోలింగ్ ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇదే కాదు రష్మిక ఏది మాట్లాడినా, ఏం చేసినా కొందరు వెతికి మరీ ఏదొక తప్పు పట్టుకుని ఏకిపారేస్తున్నారు.

ఎంత కంట్రోల్‌లో ఉందామన్నా ట్రోలింగ్ తన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. 'నేనూ అందరిలాంటి అమ్మాయినే. నాకూ భావోద్వేగాలు ఉంటాయి. కానీ వాటిని బయట ప్రదర్శించడం నాకు ఇష్టం ఉండదు. అందుకే చాలామంది నాకు పొగరు అనుకుంటారు. కొందరు డబ్బులిచ్చి మరీ నాపై ట్రోలింగ్ చేయిస్తున్నారు. నాపై ప్రేమ చూపించకపోయినా ఫర్వాలేదు కానీ వ్యతిరేక ప్రచారం చేయొద్దని వేడుకుంటున్నా. మనం ఎంత ఎదిగితే సమాజం అంతగా ట్రోల్ చేస్తుంటుంది. దాన్ని తట్టుకుని ముందుకెళ్లగలగాలి. అందుకే నేను ట్రోలింగ్‌ని పట్టించుకోను' అని చెప్పుకొచ్చింది రష్మిక. ఆమె కామెంట్స్ వైరల్ అవుతుండటంతో నెటిజన్లు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. ఎవరైనా ఎదుగుతుంటే వెనక్కి లాగేయడం సమాజంలో సర్వసాధారణమని, అవన్నీ పట్టించుకోకుండా ముందుకు వెళ్లాలని రష్మికకి సూచిస్తున్నారు. ఇంతకీ డబ్బులిచ్చి మరీ రష్మికపై ట్రోలింగ్ చేయిస్తున్నది ఎవరా? అని నెటిజన్లు ఆరా తీస్తున్నారు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,